RNI Reg-No. APTEL/2005/15854

# నేటి మనదేశం

NETIMANADESAM TELUGU DAILY

తెలుగు దినపత్రిక

Simultaneously published from Visakhapatnam, Vijayawada, Tirupati & Hyderabad

Website : https://netimanadesam.com/

సంపుటి : 21 సంచిక : 56 విశాఖపట్నం సంపాదకులు : కె.ఎస్.రంగశాయి బుధవారం 08-04-2026 పేజీలు :8 వెల : రూ.1-00

## బెంగాల్‌పై కన్నేస్తే..

### పాక్‌కు రాజ్‌నాథ్ సింగ్ స్ట్రాంగ్ వార్నింగ్



**ఢిల్లీ, ఏప్రిల్ 07 :** పాకిస్థాన్‌కు రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు. బెంగాల్‌పై కన్నేస్తే ఈసారి పాక్ ఎన్ని ముక్కలవుతుందో ఆ దేవుడికే తెలియాలంటూ హెచ్చరికలు చేశారు. భవిష్యత్తులో భారత్ ఏమైనా దాడులకు పాల్పడితే.. కోల్‌కతానూ లక్ష్యంగా చేసుకుంటామని పాక్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ ఇటీవల కవ్వింపులకు పాల్ప డ్డారు. ఈ వ్యాఖ్యల పైనే తాజాగా రాజ్‌నాథ్ ఘాటుగా స్పందిం చారు. ఓ వార్తా సంస్థతో ఆయన మాట్లాడుతూ.. ఇలాంటి రెచ్చగొట్టే వ్యాఖ్యల వల్లనే 55 ఏళ్ల క్రితం పాక్ రెండుగా విడిపోయిన విష యాన్ని గుర్తుచేశారు. 1971లో జరిగిన యుద్ధంలో పాకిస్థాన్ నుంచి విడిపోయి బంగ్లాదేశ్ స్వతంత్రదేశంగా ఏర్పడింది. నాడు బంగ్లా విముక్తి పోరాటానికి భారత సైన్యం అండగా నిలిచింది. ఉద్రిక్తతలను పెంచే ప్రకట నలు చేయవద్దని ఇస్లామా బాద్‌ను ఆయన హెచ్చరిం చారు. వారు బెంగాల్‌పై కన్నేస్తే.. ఈసారి పాక్ ఎన్ని ముక్కలవుతుందో ఆ దేవుడికే తెలియాలి అని వ్యాఖ్యానించారు.

## రూ.39,436 కోట్లతో విలువైన 31 ప్రాజెక్టులు



### చంద్రబాబు అధ్యక్షతన ఎస్ఐపీబీ ఆమోదం

**అమరావతి, ఏప్రిల్ 07 (నేటి మనదేశమ్) :** సీఎం చంద్రబాబు అధ్యక్షతన 16వ పెట్టు బడుల ప్రోత్సాహక బోర్డు ఎస్ఐపీబీ సమావేశం జరిగింది. రూ.39,436 కోట్ల విలువైన 31 ప్రాజెక్టులకు ఎస్ఐపీబీ ఆమోదం తెలిపింది.

ఈ ప్రాజెక్టుల ద్వారా ప్రత్యక్షంగా 1,11,278 మందికి ఉద్యోగ అవకాశాలు రానున్నాయి. అమరావతి క్వాంటం వ్యాలీలో 3 సంస్థల ఏర్పాటుకు ప్రోత్సాహక బోర్డు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఏపీలో ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తుల తయారీపై ప్రత్యేక దృష్టి సారించాలని ఈ సందర్భంగా చంద్ర బాబు సూచించారు. సాగు వ్యర్థాల సద్వినియోగం కోసం యూనిట్ల ఏర్పాటుకు ఎస్ఐపీబీ ఆమోదం తెలిపింది. ఆధునిక భద్రతా ప్రమాణాలతో పారిశ్రామిక ప్రాజెక్టులు ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. రాయలసీమను సౌరవిద్యుత్ ఉత్పత్తి కేంద్రంగా తీర్చిదిద్దాలని ఈ సందర్భంగా అధికారులకు చంద్రబాబు దిశానిర్దేశర చేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో 325 గిగావాట్ల సౌరవిద్యుత్ ఉత్పత్తికి అవకాశం ఉందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. రానున్న రోజుల్లో సౌరవిద్యుత్ ఉత్పత్తి మరింత పెరిగేలా చర్యలు తీసుకోవాలని, సౌరవిద్యుత్ సామర్థ్యానికి అనుగుణంగా పెట్టుబడులు ఆకర్షించాలని సీఎం సూచించారు.

## భారత్ ధర్మసత్రం కాదు: అమిత్ షా



**పశ్చిమ బెంగాల్, ఏప్రిల్ 07 :** అసెంబ్లీ ఎన్నికల పోలింగ్‌కు సమయం దగ్గర పడుతుండటంతో ఆయా రాష్ట్రాల్లో ప్రచారం జోరుగా సాగుతోంది. తాజాగా అస్సాంలోని బరాక్ లోయలో జరిగిన ఎన్నికల ప్రచారంలో కేంద్రమంత్రి అమిత్ షా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన అక్రమ చొరబాటుదారుల ప్రస్తావన తీసుకొచ్చారు. పశ్చిమ బెంగాల్‌లో అభివృద్ధి జరగాలన్నా, అక్రమ చొరబాటుదారులను తరిమికొట్టాలన్నా అది భాజపా వల్లే సాధ్యం అవుతుందని పేర్కొన్నారు. భాజపా అధికారంలోకి వస్తేనే ఇవన్నీ జరుగుతాయన్నారు. బరాక్ లోయలో బెంగాలీలు ఎక్కువగా ఉంటారు. దీంతో ఆయన బెంగాల్‌లో అక్రమచొరబాటుదారుల అంశాన్ని పేర్కొనడం గమనార్హం. "పౌరసత్వ సవరణ చట్టం ప్రకారం గూఢచర్యం చేసే వ్యక్తులకు దేశంలో స్థానం లేదని తెలిసే ఆ చట్టాన్ని కాంగ్రెస్ వ్యతిరేకిస్తోంది. రెడ్ కార్పెట్ వేసి మరీ అక్రమ చొరబాటుదారులకు ప్రవేశం కల్పిస్తోంది. భారత్ ధర్మసత్రం కాదు. అక్రమ చొరబాటు దారులకు ఇక్కడ స్థానం లేదు. ఒక్కసారి భాజపా అధికారం లోకి రాగానే రాష్ట్రంలో మార్పు మొద లవుతుంది. బెంగాల్‌లో ఉన్న చొరబాటు దారులను తిరిగి వారి దేశాలకు వెళ్లగొడతాం" అని అమిత్ షా పేర్కొన్నారు. "కాంగ్రెస్ నేతలకు అసలు ప్రజల కష్టాలు తెలుసుకోవాలనే ఉద్దేశం ఉండదు. నిరసన కారులను మెచ్చుకుంటూ రాహుల్ గాంధీ వ్యాఖ్యలు చేశారు. దీంతో ఆ పార్టీ ఏ స్థాయిలో ఉందో తెలుసుకోవచ్చు" అని పేర్కొన్నారు.

## వియత్నాం అధ్యక్షుడిగా ఎన్నికైన టో లామ్‌కి మోడీ అభినందనలు



**న్యూ ఢిల్లీ, ఏప్రిల్ 07 :** వియత్నాం అధ్యక్షుడిగా ఎన్నికైన టో లామ్‌కు మంగళ వారం ప్రధాని మోడీ అభినం దనలు తెలిపారు. టో లామ్ నాయకత్వంలో న్యూఢిల్లీ, హనోరు మధ్య సంబంధాలు మరింత బలపడతాయని మోడీ విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ మేరకు మోడీ సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పోస్టు చేశారు. 'వియత్నాం సోషలిస్ట్ రిపబ్లిక్ అధ్యక్షుడిగా ఎన్నికైన టో లామ్‌కి నా హృదయ పూర్వక అభినందనలు. ఆయన నాయకత్వంలో భారత్- వియత్నాం దేశాల మధ్య కాలపరీక్షకు నిలిచిన స్నేహం మరింత బలపడుతుందని నేను దృఢంగా నమ్ము తున్నాను. మన ప్రజల ప్రాంతం పురోగతి, శ్రేయస్సు కోసం సమగ్ర వ్యూహాత్మక భాగ స్వామ్యాన్ని మరింత బలోపేతం చేయడానికి, మీతో కలిసి పని చేయడానికి నేను ఎదురు చూస్తున్నాను' అని మోడీ ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు. వియత్నాం కమ్యూనిస్టు పార్టీ సెంట్రల్ కమిటీ (సిపివిసిసి) ప్రధాన కార్యదర్శిగా ఉన్న టో లామ్‌ని అధ్యక్షుడిగా ఎన్నుకుంది.

ఈయన పదవీకాలం ఐదేళ్లు (2026-2031) కొనసాగుతుంది. ఈ విషయాన్ని వియత్నాం జాతీయ అసెంబ్లీ మంగళవారం ధృవీకరించినట్లు జిన్హువా న్యూస్ ఏజెన్సీ వెల్లడించింది.

## ఐదు రాష్ట్రాల్లో ఎగ్జిట్ పోల్స్‌పై నిషేధం విధించిన ఎన్నికల కమిషన్




**న్యూఢిల్లీ, ఏప్రిల్ 07 :** ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి ఎగ్జిట్ పోల్స్‌పై ఎన్నికల కమిషన్ నిషేధం విధించింది. ఏప్రిల్ 9వ తేదీ ఉదయం 7.00 గంటల నుండి ఏప్రిల్ 29వ తేదీ సాయంత్రం 6.30గంటల వరకు ఎగ్జిట్ పోల్స్ సర్వే నిర్వహించడం, వాటి ఫలితాలను వెల్లడించకూడదని ఎన్నికల కమిషన్ మంగళవారం - మిగతా 2లో..

## బస్సుల్లో ఈ జాగ్రత్తలు పాటించండి..


### ఆర్టీసీ అధికారిని ప్రశంసించిన లోకేశ్



వార్త... 2 లో

## రుషికొండ భవనాల వినియోగం

### ఆదాయ వనరుగా మార్చుకోవాలని నిర్ణయం



**అమరావతి, ఏప్రిల్ 07 (నేటి మనదేశమ్) :** విశాఖ రుషికొండ భవనాల వినియోగంపై ఏర్పాటైన కేబిసి కమిటీ తమ అధ్యయన తుది నివేదికను సిద్ధం చేసింది. సచివాలయంలోని మంత్రి కందుల దుర్గేశ్ కార్యాలయంలో సబ్ కమిటీ ఐదోసారి భేటీ అయ్యింది. మంత్రులు పయ్యావుల కేశవ్, డోలా బాలవీరాంజనేయస్వామి వర్చువల్‌గా హాజరయ్యారు. గత నాలుగు భేటీల్లో తీసుకున్న నిర్ణయాలపై చర్చించిన మంత్రులు.. పరిగణనలోకి తీసుకోవాల్సిన అంశాలపై తుది నివేదిక సిద్ధం చేశారు. రుషికొండ ప్యాలెస్‌ను - మిగతా 2లో..

## జిల్లా ప్రత్యేకతను చాటిచెప్పేలా అభివృద్ధి కార్యాచరణ ఉండాలి



- ప్రభుత్వ ప్రాధాన్యతే... మనందరి ప్రాధాన్యతగా ప్రతి అధికారీ పని చేయాలి
- 60% సమయం సాధారణ పనులకు, 40% వినూత్న లక్ష్యాల కోసం వెచ్చించాలి
- జిల్లా అభివృద్ధి సమీక్షా సమావేశంలో జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ సూచనలు

**విశాఖపట్నం, నేటి మనదేశమ్ ప్రతినిధి, ఏప్రిల్ 07 :** విశాఖపట్టణం జిల్లాకు ప్రపంచ వ్యాప్తంగా కీర్తి, ప్రతిష్టలు ఉన్నాయని.. ఆ ఖ్యాతి, పేరుకు తగ్గట్టుగానే వినూత్న రీతిలో అభివృద్ధి ప్రాజెక్టులు చేపట్టాలని, ప్రత్యేక కార్యాచరణ రూపొందించి ముందుకు సాగాలని జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ జిల్లా అధికారులను ఉద్దేశించి పేర్కొన్నారు. జిల్లా అభివృద్ధి, ప్రజా సేవల మెరుగుదల, విభాగాల సమన్వయంపై కలెక్టరేట్ మీటింగు హాలులో మంగళవారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఈ మేరకు ఆయన కీలక సూచనలు చేశారు. జాయింట్ కలెక్టర్ గొబ్బిళ్ల విద్యాధరి, డీఎఫ్వో రవీందర్ ధామతో కలిసి ఆయన వివిధ అంశాలపై కూలంకషంగా సమీక్షించారు. ఈ సంద ర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వివిధ శాఖలు, ప్రతి విభాగం తన పరిధిలోని సమాచారం, సమస్యలు, పురోగతిని అధికారులు నేరుగా తనకు తెలియజేయాలని, మధ్యవర్తుల ద్వారా కాకుండా నేరుగా కమ్యూనికేషన్ కొనసాగించాలని, అవసరమైతే ఎప్పుడైనా తనను సంప్రదించవచ్చని పేర్కొన్నారు. జిల్లాలో అన్ని ప్రభుత్వ శాఖల పరిధిలో 100కు పైగా పథకాలు అమలవుతున్న నేపథ్యంలో, ప్రతి అధికారి తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. అధికారుల పని సమయాన్ని 40% సాధారణ ప్రాజెక్టులకు, పనులకు 60% జిల్లా అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం, వినూత్న ప్రాజెక్టులు చేపట్టేందుకు కేటాయించాలని సూచించారు. ప్రభుత్వ తరువాయి 2లో..

## నిర్దిష్ట కమ్యూనిటీ ఓటర్లను తొలగించిన కేంద్రం

### పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ




**కోల్‌కతా, ఏప్రిల్ 07 :** ఎస్ఐఆర్ పేరుతో కేంద్రం నిర్దిష్ట వర్గానికి చెందిన ఓటర్ల పేర్లను జాబితా నుండి తొల గించారని పశ్చిమ బెంగాల్ సిఎం మమతా బెనర్జీ ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం నదియా జిల్లా లోని చక్దాహా అసెంబ్లీ నియో జకవర్గంలో ప్రచారం నిర్వహిం చారు. ఈ సందర్భంగా మాట్లా డుతూ.. ఎస్ఐఆర్ పేరుతో కేంద్రం ఉద్దేశ్య పూర్వకంగా నిర్దిష్ట వర్గానికి చెందిన ఓటర్ల పేర్లను తొలగించిందని అన్నారు. ఓటర్ల జాబితాలో పేర్లు తొలగించ బడిన ఓటర్లకు టిఎంసి అండగా నిలుస్తుందని అన్నారు. రాష్ట్రంలో ఎస్ఐఆర్ ప్రక్రియ అనంతరం ఓటర్ల జాబితా నుండి సుమారు 91 లక్షల పేర్లను తొలగించినట్లు ఎన్నికల కమిషన్ తాజా నివేదిక తెలిపింది. అయితే సుప్రీంకోర్టును ఆశ్రయించడంతో.. తీర్పు అనంతరం...

సుమారు 60 లక్షల పేర్లలో 32 లక్షల పేర్లను తిరిగి చేర్చినట్లు మమతా బెనర్జీ తెలిపారు.

# నేటి మనదేశమ్ సంపాదకీయం


## రాజకీయం కోసం అభివృద్ధికి మోకాలడ్డరాదు !

రాజకీయాలు వేరు..అభివృద్ధి వేరు. ఈ రెంటిని కలగలిపి చూస్తే..అభివృద్ధి వెనక్కి పోతుంది. తెలంగాణలో మూసీ ప్రక్షాళన విషయంలో ఇదే జరుగుతోంది. ఏపిలో అమరావతి విషయంలనూ ఇదే కనిపిస్తోంది. తెలంగాణలో మూసీ ప్రక్షాళన చేస్తామని సిఎం రేవంత్ రెడ్డి పట్టుదలతో ఉన్నారు. ఇప్పుడు చూపిన నమూనా ప్రకారం ముందుకు వెళితే మంచిదే. అదేవిధంగా నిర్వాసితులకు ఉత్తమ ప్యాకేజీ, వారు ఆనందపడిపోయేలా ఉండాలి. ఇల్లుకు ఇల్లు, జాగాకు జగా అందాలి. మూసీని ప్రక్షాళన చేయడంలో ఎవ్వరికీ అభ్యంతరం ఉండదు. అలాగే మురుగనీటిని ఎలా, ఎక్కడికి తరలిస్తారన్నది కూడా పెద్ద సమస్య. హైదరాబాద్ మురుగునీటిని ఇంతకాలం మూసీలో పారబోస్తున్నారు. దానికి ప్రత్యామ్నాయం చూపాలి. ఇకపోతేమూసీ ప్రక్షాళనను వ్యతిరేకిస్తున్న బిఆర్ఎస్, బిజెపిలు ప్రత్యామ్నాయాలు చూపడం లేదు. ఇలా చేద్దామని సలహాలు ఇవ్వడం లేదు. ఎందుకంటే ఇది రాజకీయం. రాజకీయాన్ని అభివృద్ధితో ముడిపెట్టడం వల్లనే మూసీ ప్రక్షాళనను ఈ రెండు పార్టీలు వ్యతిరేకిస్తున్నాయి. పదేళ్లు పాలించిన బిఆర్ఎస్ తెలంగాణ అడుక్తికునేలా చేసింది. ఇలాంటి రాజకీయాల వల్లనే తెలంగాణ మరింత వెనకబాటుకు గురవుతుంది. ఇకపోతే అమరావతి విషయంలో జగన్, ఆయన అనుచరగణం చేస్తున్న విమర్శలు, రాజకీయాలు చూస్తుంటే..ఇలాంటి నాయకులు ఉన్నందుకు సిగ్గుపడాలి. అమరావతి రాజధాని నిర్మాణం అవసరం. కానీ అసలు రాజధానే అవసరం లేదంటున్న వారు రాజకీయాల్లో ఉండడానికి లేదు. 2019 ఎన్నికల్లో 151 సీట్ల భారీ మెజారిటీని జగన్ మోహన్ రెడ్డికి కట్టబెడితే చేసిందేమిటి. ఆనాడు మావిగన్ ఆలోచన ఎందుకు రాలేదు. ఆనాడు మడు రాజధానులంటూ ఎందుకు ఊరేగారు. రాజధాని అవసరం లేదన్న వారు ఐదేళ్లు కాలయాపన చేశారు. అప్పటి నుంచి జగన్ రాజకీయ నిజస్వరూపం వెల్లడవుతూ వచ్చింది. ప్రజలకు ఆయన ఏమిటో బోధ పడింది. కక్షలు, కార్పణ్యాలు, అసూయా ద్వేషాలతో ఐదేళ్లపాటు సాగించిన పాలనతో ప్రజలకు చైతన్యం వచ్చి ఉండాలి. ఎందుకంటే ఇలాంటి నేతను మోసినందుకు సిగ్గుపడాలి. రాజకీయాల్లో వైఫల్యాలను గుణపాఠాలుగా మలచు కొని ముందుకు సాగాలి. కానీ ఇక్కడ బిఆర్ఎస్, అక్కడ జగన్ పార్టీకి ఇవేవీ కానరావడం లేదు. ఇప్పటికీ ఈ రెండు పార్టీల నేతలకు జ్ఞానోదయం కావడం లేదు. వారికి కావలసిం దల్లా అధికార పీటం తప్పు, అభివృద్ధి కాదు. భజనపరులు చుట్టూ ఉంటే అధికారంలో ఉన్నప్పుడు ప్రజా వ్యతిరేకత కనిపించదు. ప్రజలకు డబ్బు పంచితే గంపగుత్తగా ఓట్లు పడతాయని లెక్కలు వేసుకున్న నేటి విపక్ష నేతలు ఆనాడు మళ్లీ తమదే అధికారం అని ధంకా బజాయించారు. అందుకే అధికారంలో ఉన్నప్పుడు ఒళ్లు దగ్గర పెట్టుకుని పాలన చేయాలి. ఇప్పుడు రేవంత్ రెడ్డి అయినా అదే చేయాలి. ఎందుకంటే భూకబ్జాలపై వస్తున్న ఆరోపణలపై మేల్కోవాలి. వెంటనే ఖండించాలి. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఆయన తనయుడిపై విపరీతమైనా ఆరోపణలు ఉన్నాయి. వీటిని ఖండించకపోవడంతో అనుమానాలు మరింతగా బలపడుతున్నాయి. రేవంత్ ఇలాంటి విషయాలపై ఖచ్చితంగా లేకుంటే వచ్చే ఎన్నికల్లో ఆయన కూడా మూసీలో కొట్టుకు పోవడం ఖాయం. నిర్మాణాత్మక పనులు ఇంకా రేవంత్ మొదలు పెట్ట లేదు. ఎంతసేపు రేషన్ కార్డులు, సన్నబియ్యం, చీరలు, ఫ్రీ బస్సు వంటివే కనిపిస్తున్నాయి. ఇవేవీ అభివృద్ధి కాదని గుర్తించాలి. ఇకపోతే ఆనాడు వైనాట్ 175 అన్న జగన్ ఇప్పుడు మళ్లీ మనదే అధికారం అంటున్నారు. తెలంగాణలో కెటిఆర్ కూడా అదే మాట్లాడుతున్నారు. ఎపిలో కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తికావస్తోంది. ఇంకేముందీ ప్రజల్లో కూటమి ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత ఏర్పడిందని, ఇక ఉన్నది రెండేళ్ల కాలమని, చివరి సంవత్సరం అంతా ఎన్నికలకే పోతుందని, తన పాదయాత్ర కూడా ఉంటుందని జగన్ నమ్మబలుతుకున్నారు. అధికారంలో ఉన్నప్పుడు చేసిన అరాచకాలను ప్రజలు మరచిపోరని ఏ పార్టీ అయినా గుర్తించాలి. అధజకారంలో ఉన్నప్పుడు జగన్‌కు మావిగన్ ఆలోచన రాలేదు. అంటే అమరావతి మీద ద్వేషంతో చేస్తున్నదే అని వేరుగా చెప్పాల్సిన పనిలేదు. మహా నగరాలతో 'మావిగన్' పోటీ పడుతుందని ప్రచారం కూడా మొదలెట్టారు. రాజ్యాంగంలో రాష్ట్రాలకు రాజధాని అనే పదం లేదని జగన్ చెప్పడం చూస్తుంటే, ఇలాంటి వ్యక్తిని ఎందుకు ఆదరించాలో ప్రజలు కూడా ఆలోచించాలి. హైదరాబాద్ మహా నగరం నుంచి వస్తున్న ఆదాయంతోనే తెలంగాణ నడుస్తోంది. ఇప్పుడు రేవంత్ ఫ్యూచర్ సిటీ అంటున్నారు. ఇది సాధ్యామా అన్నది కూడా ఆలోచించాలి. నగరాలు వాటంతటే అవే రావాలి తప్ప, చేస్తే రావు. అరావతి వేరు...ఫ్యూచర్ సిటీ వేరు అని గుర్తించాలి. ఆంధ్రప్రదేశ్‌కు ప్రస్తుతం విశాఖపట్నం నుంచి అధికంగా ఆదాయం వస్తోంది. అమరావతి మహా నగరంగా అభివృద్ధి చెందితే రాష్ట్ర ఆదాయం గణనీయంగా పెరుగుతుంది. రైతులు ఇచ్చిన భూములను అభివృద్ధి చేసి, అందులో కొంత భాగాన్ని విక్రయించి ఆ డబ్బుతో మౌలిక వసతులు కల్పించబోతున్నారు. హైదరాబాద్ ఇప్పటి రూపం సంతరించుకోవడానికి మూడు దశాబ్దాలకు పైగా పట్టింది. అభివృద్ధి అనేది నిరంతర పక్రియ. సంకుచితంగా ఆలోచించేవారు అభివృద్ధి గురించి ఆలోచించ లేరు. అందుకే రాజకీయాలు వేరు. అభివృద్ధి వేరు. రాజకీయ పార్టీల నేతలకు దూరదృష్టి ఉండాలి. అభివృద్ధిపై అవగాహన ఉండాలి. వందేళ్ల ముందు గురించి ఆలోచించాలి. అంతేగాని రాజకీయాలతో వెనకేసుకుని బతుకుదామనుకునే వారు పాలకులు కాబోరు.



**విశాఖపట్నం, ఏప్రిల్ 07 (నేటి మనదేశమ్) :**
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ తాడేపల్లి ఆఫీసులో మన ప్రియతమ నాయకులు రాష్ట్ర అధ్యక్షులు మాజీ ముఖ్యమంత్రివర్యులు వైయస్ జగన్మోహన్ రెడ్డిని మన దక్షిణ నియోజకవర్గం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త, మాజీ శాసనసభ్యులు వాసుపల్లి గణేష్ కుమార్ సమక్షంలో మర్యాదపూర్వకంగా కలిసినవైయస్సార్ కాంగ్రెస్ పార్టీ విశాఖ సిటీ సెక్రెటరీ మా 35వ వార్డు సీనియర్ నాయకుడు అబ్బిరెడ్డి ఆదివిష్ణురెడ్డి.

## శ్రీ వరాహ లక్ష్మీనరసింహ స్వామి వారిని దర్శించుకున్న విశాఖ దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, పద్మజ దంపతులు



**విశాఖపట్నం, ఏప్రిల్ 07 (నేటి మన దేశమ్) :** ఆధ్యాత్మిక కేంద్రం, ప్రముఖ పుణ్యక్షేత్రమైన సింహగిరిపై కొలువై ఉన్న శ్రీ శ్రీ శ్రీ వరాహ లక్ష్మీనరసింహ స్వామి వారిని మంగళవారం విశాఖ దక్షిణ నియోజకవర్గ శాసనసభ్యులు శ్రీ వంశీకృష్ణ శ్రీనివాస్ తన సతీమణితో కలిసి అత్యంత భక్తిశ్రద్ధలతో దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న ఎమ్మెల్యే దంపతులకు దేవస్థానం ఏ ఈ ఓ తిరుమలేశ్వరరావు స్వాగతం పలికారు. అనంతరం ధ్వజస్తంభం వద్ద ఆలయ పర్యవేక్షణ అధికారి వారికి సంప్రదాయ బద్ధంగా స్వాగతం పలికి ఆలయ మర్యాదలను అనుసరించి స్వామివారి దర్శనానికి తోడ్కొని వెళ్లారు. ముందుగా ఎమ్మెల్యే దంపతులు సింహాచల క్షేత్రంలోని అత్యంత మహిమాన్వితమైన కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకుని, తమ మొక్కులను తీర్చుకున్నారు. అనంతరం గర్భాలయంలోని శ్రీ వరాహ లక్ష్మీనరసింహ స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు స్వామివారి దివ్య రూపం, క్షేత్ర ప్రాశస్త్యం గురించి వివరించారు. దర్శనా నంతరం ఆలయ మండపంలో వేద పండి తులు నాదస్వర మంగళ వాయిద్యాల మధ్య, వేద మంత్రోచ్ఛారణలతో ఎమ్మెల్యే దంపతులకు 'వేద ఆశీర్వచనం' అంద జేశారు. ఈ సందర్భంగా: ఆలయ ఏఈవో స్వామివారి శేష వస్త్రంతో ఎమ్మెల్యే దంప తులను ఘనంగా సత్కరించారు. స్వామివారి జ్ఞాపిక (చిత్రపటం) మరియు పవిత్ర ప్రసాదా లను వారికి అంద జేశారు. ఈ కార్యక్రమంలో గుంటూరు జనసేన నేత శ్రీనివాస్ గారు, దేవస్థాన సిబ్బంది పాల్గొన్నారు...

## ఎస్. కోట సీతారాంపురంలో ఘనంగా శ్రీ వీరాంజనేయ తీర్థ మహోత్సవం

- ఆకట్టుకున్న ఎడ్లు పరుగు పోటీలు
- కోలాటం, డాన్స్ బేబీ డాన్స్ కార్యక్రమాలు సందడి



**వేపాడ, ఏప్రిల్ 07 (నేటి మనదేశమ్) :** కొండగశీగుపూడి శివారు శ్రీ వీరాంజనేయ స్వామివారి తీర్థ మహోత్సవం సందర్భంగా సీతారాంపురం గ్రామంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా తెల్లవారు జామునే స్వామివారికి ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించి భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.మహోత్సవాల్లో భాగంగా నిర్వహించిన ఎడ్లు పరుగు పోటీలు ప్రేక్షకు లను విశేషంగా ఆకట్టుకున్నాయి. వివిధ గ్రామాల నుండి వచ్చిన బండ్లు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించాయి. పోటీలు అత్యంత ఉత్కంఠ భరితంగా సాగగా, తక్కువ సమయంతో గమ్యాన్ని చేరిన బండ్లు విజేతలుగా నిలిచాయి.ఈ పోటీల్లో కే ఎల్ బి పురం బండి 2.08.71 పాయింట్లతో ప్రథమ స్థానాన్ని దక్కించుకుని మొదటి బహుమతిని గెలుచుకుంది. వల్లంపూడి మరియు చుక్కపల్లి బండ్లు 2.10.32 పాయింట్లతో సంయుక్తంగా రెండో స్థానంలో నిలిచాయి. వల్లంపూడి మరో బండి 2.11.72 పాయింట్లతో మూడో స్థానం సాధించింది. అలాగే హరి కృష్ణ (2.11.70), నరసయ్యపేట (2.11.99), వావిలపాడు (2.12.52), శ్రీను కోటపాడు (2.15.26), వరడా జ్ఞాన ప్రసన్న (2.15.66), వావిలపాడు (2.17.62), కేజీ పురం మరియు చుక్కపల్లి (2.18.10), మోసజ్జ-నర్సీపేట (2.20.07), తుమ్మకపల్లి (2.21.24), దేవరపల్లి వీరాంజనేయ (2.22.10), కొండ్రం (2.25.02, 2.28.60), పాతిక రమణ (2.32.07), కొట్టం (2.37.67) తదితరులు తమ ప్రతిభను చాటుకున్నారు.ఇక సాయంత్రం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. గ్రామ యువతులు, మహిళలు పాల్గొన్న కోలాటం ప్రదర్శనలు ప్రేక్షకు లను అలరించాయి. అనంతరం నిర్వహించిన "డాన్స్ బేబీ డాన్స్" కార్యక్రమంలో చిన్నారులు, యువతులు ఉత్సాహంగా నృత్యాలు ప్రదర్శించి అందరినీ ఆకట్టుకున్నారు.ఈ కార్యక్రమానికి పరిసర గ్రామాల ప్రజలు భారీగా హాజరై పోటీలను ఆస్వాదించారు. విజేతలకు నగదు బహుమతులు అందజేసి నిర్వాహకులు సత్కరించారు. మొత్తం మహోత్సవం గ్రామంలో పండుగ వాతావరణాన్ని సృష్టించింది.



## అధినేతను కలిసిన మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి..
### శ్రీవారి పంచలోహ విగ్రహ అందజేత



**విశాఖపట్నం, ఏప్రిల్ 07 (నేటి మనదేశమ్) :** మాజీ ముఖ్యమంత్రి వైఎస్ఆర్సిపి అధినేత వైయస్ జగన్మోహన్ రెడ్డిని మాజీ ఎమ్మెల్యే దక్షిణ నియోజకవర్గ సమన్వయకర్త వాసుపల్లి గణేష్ కుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు. తాడేపల్లి గూడెంలో మంగళ వారం కలిసి శ్రీవారి పంచలోహ విగ్రహాన్ని అందజేసి శాలువాతో సత్కరించారు. ఇటీవల విజయవంతంగా జరిగిన క్యాడర్ రిజిస్ట్రేషన్ ఆన్లైన్ ప్రక్రియ, దక్షిణ నియోజకవర్గం లో రాజకీయ అంశాలుపై మాట్లాడారు. అలాగే ఓటిపి వెరిఫికేషన్ ప్రక్రియ ముమ్మరంగా నిర్వహిస్తున్నామని ఆ డేటాను కూడా త్వరలో అందజేస్తామని ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ అధినేతకు తెలియజేశారు. పార్టీని మరో అంత బలోపేతం చేసే దిశగా క్యాడర్ను, కార్యకర్తలకు పార్టీ తగిన గుర్తింపు ఇస్తుందని జగన్మోహన్ రెడ్డి తెలిపారు అన్నారు. ఇటీవలే పార్టీ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తూ రాష్ట్ర జిల్లా స్థాయిలో గుర్తింపు లభించిన కొంతమంది దక్షిణ వైసిపి నేతలను జగన్మోహన్ రెడ్డికి వాసుపల్లి గణేష్ కుమార్ పరిచయం చేసారు. అనంతరం వారితో ఫోటో దిగారు. ఈ కార్యక్రమం లో స్టేట్ RTI సెక్రటరీ దస్మాంతుల వేణుగోపాల్, స్టేట్ యూత్ సెక్రటరీ కనకల ఈశ్వర్రావు, స్టేట్ సంస్కృత విభాగం సెక్రటరీ కంటుముచ్చు సాగర్, జిల్లా వైస్ ప్రెసిడెంట్ డేవిడ్ రాజు, జిల్లా జనరల్ సెక్రటరీ గనగల రామరాజు, జిల్లా సెక్రెటరీ అబ్బిరెడ్డి ఆదివిష్ణు, జిల్లా ఆర్టిఐ సెక్రటరీ వడ్డాది దిలీప్,జిల్లా బీసీ సెల్ ప్రెసిడెంట్ సనపల రవీంద్ర,జిల్లా బీసీ సెల్ జనరల్ సెక్రటరీ చోడిపల్లి శివ,సౌత్ మైనారిటీ సెల్ ప్రెసిడెంట్ యాసిన్,సౌత్ ఎస్సీ సెల్ ప్రెసిడెంట్ ఆకుల శ్యామ్,సౌత్ సోషల్ మీడియా ప్రెసిడెంట్ బేవర మహేష్, వార్డ్ నాయకులు సూరిని రాము, కొణతాల కృష్ణవేణి, చాపల నూకరాజు, పతోజి అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

## హెల్మెట్ వినియోగంపై ప్రత్యేక డ్రైవ్




**శ్రీకాకుళం, ఏప్రిల్ 07 (నేటి మనదేశమ్) :**
జిల్లా ఎస్పీ కెవి మహేశ్వర రెడ్డి ఆదేశాలు మేరకు జిల్లాలో హెల్మెట్ వినియోగంపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించడం జరుగుతుంది. ఈ కార్యక్రమంలో భాగంగా మంగళవారం పోలాకి పోలీస్ స్టేషన్ పరిధిలో సబ్ ఇన్స్పెక్టర్ రంజిత్ కుమార్ ఆధ్వర్యంలో ఈదులవలస జంక్షన్ వద్ద హెల్మెట్ ధారణపై అవగాహన కార్యక్రమం చేపట్టి ద్విచక్ర వాహనదారులకు డ్రైవర్‌తో పాటు వెనుక కూర్చునే వారు కూడా తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని అవగాహన కల్పించారు. రోడ్డు ప్రమాదాల సమయంలో హెల్మెట్ ప్రాణాలను కాపాడగల ముఖ్యమైన భద్రతా సాధనం అని వివరించారు.

అదేవిధంగా, వాహనదారుల చేత హెల్మెట్ వినియోగంపై ప్రతిజ్ఞ చేయించారు. హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తున్న వారికి చట్టపరమైన చర్యలు తీసుకుని జరిమానాలు వేస్తామన్నారు. ప్రజలు రోడ్డు భద్రత నియమాలను కచ్చితంగా పాటించాలని అన్నారు.

## స్వచ్ఛ సర్వేక్షన్ 2025-26 కార్యక్రమం



**భీమునిపట్నం ఏప్రిల్ 07 నేటి మనదేశమ్ :** స్థానిక జోనల్ కార్యాలయం వద్ద మహిళా పారిశుద్ధ్య కార్మికులకు ముగ్గులపోటి నిర్వహించారు.. ఈ కార్యక్రమం లో మహిళా పారిశుద్ధ్య కార్మికులు ఆసక్తి గా పాల్గొని స్వచ్ భారత్, స్వచ్ సర్వేక్షన్, జీ వి ఎం సి అనే వివిధ రకాల నినాదాలతో ఆకర్షణీయం గా ముగ్గులు వేసారు.పోటీ లో పాల్గొన్న కార్మికులను జోనల్ కమిషనర్ ఎం.విజయ్ కుమార్ అభినందిస్తూ మొదటి, ద్వితీయ, తృతీయ బహుమతులు అందించారు, అనంతరం గొల్లవీధి లో హోమ్ కంపోస్టింగ్ చేస్తున్న .సరస్వతి అనే మహిళను కలిసి , ఆమె ఇంటి వద్ద ఏ విధం గా హోమ్ కంపోస్టింగ్ చేసే విధానాన్ని తెలుసుకొని , ఆమెనుఅభినందించారు.అందరు ఇదే విధం గా ఇంటి వద్ద వ్యర్థాలను వేరు చేసి తడి చెత్తను ఉపయోగించి ఇంటి వద్దనే కంపోస్ట్ తయారు చేసుకోవాలని తెలియజేశారు.



**కొయ్యూరు, ఏప్రిల్ 07 (నేటి మనదేశమ్) :**
మండలంలోని చిడిపాలెం పంచాయతీ, సర్పంచ్ నత్తూరు సోమన్న దొర, దంపతులకు , సచివాలయ సిబ్బంది సచివాలయంలో దుస్సాలు వద్ద సన్మానించారు. గత ఐదు సంవత్సరాలు, పంచాయతీ అభివృద్ధికి అన్ని విధాల సహాయ సహకారాలు, అందించి, సచివాలయ సిబ్బందికి, పంచాయతీ ప్రజలకు అందించినందుకుగాను, సన్మానించామని సచివాలయ సిబ్బంది తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రెటరీ తో పాటు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## జిల్లా పరిషత్ వారపు సంతలో

# చేతివాటం చూపిస్తున్న ఆసీల పాటదారులు

- రసీదులు ఇవ్వకుండానే అక్రమ వసూళ్లకు పాల్పడుతు రైతులను మోసగిస్తున్న పాటదారులు
- జిల్లా పరిషత్ అధికారులు ధరల పట్టిక ఏర్పాటు చేయాల్సి ఉన్న చేయటం లేదని సమాధానం



**కొత్తవలస నేటి మనదేశమ్ ప్రతినిధి :** కొత్తవలస మండల కేంద్రంలో ప్రతి మంగళవారం జరుగుతున్న వారపు సంతలో ఆసిల వసూళ్లు చేసేవారు వారి చేతి వాటం చూపిస్తూ అధికారులపై నెపం నెట్టే ప్రయత్నం చేస్తున్నారు జిల్లా పరిషత్ అధికారులు సంతలో ధరల పట్టిక ఏర్పాటు చేయాల్సి ఉన్న ఎక్కడ ధరల పట్టిక ఏర్పాటు చేయడం లేదని చెబుతూనే వారపు సంతలో వ్యాపారాలు చేసుకునేందుకు వచ్చిన రైతుల నుండి ఆసీల పేరుతో 20 రూపాయల నుండి 60 రూపాయల వరకు వసూలు చేస్తూ రైతులను నిట్ట నిలువు నా ముంచి ఆసీల పాటదారులు లక్షల రూపాయలు వెనక వేసుకుని ఆసీల పాట జరిగే సమయంలో వేరే వారికి పాట చిక్కకుండా ముందస్తుగానే బేర సారాలకు దిగి రాష్ట్ర ప్రభుత్వ ఆదాయానికి భారీ గానే గండి కోడుతున్న జిల్లా పరిషత్ అధికారులు వారు చెప్పినదానికి సరేలే అనటమే కాకుండా ఆసీల పాటదారులు చెప్పినదే రేటుకు ఆసీల పాటను కట్టబెట్టి చేతులు దులుపుకొని మామ అనిపిస్తున్నారే తప్ప ఆసీల పాటదారులు సిండికేట్ అవడం వల్ల రాష్ట్ర ప్రభుత్వానికి వచ్చే ఆదాయానికి గండి పడుతుందని జిల్లా అధికారులు ఆలోచించకపోవడం శోచనీయమని ప్రజలు సైతం చెవులు కోరుకుంటున్నారు ఇప్పటికైనా కొత్తవలస మండల కేంద్రంలో ప్రతి మంగళవారం జరిగే వారపు సంతలో ఆసీల పాతదారులపై జిల్లా పరిషత్ అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులను వీరి దోపిడీ నుంచి కాపాడాలని ప్రజలు కోరుతున్నారు

**మండల ఎంపీడీవో సజీవని రమణయ్య వివరణ :-** ప్రతి మంగళవారం జరిగే జిల్లా పరిషత్ వారపు సంతలో పరిశీలించి ధరల పట్టికను ఏర్పాటు చేసి రైతులకు రసీదులు ఇచ్చేటట్టు చర్యలు తీసుకుంటామని తెలిపారు,



**అప్పల నరసమ్మ వారపు సంతలో మాంసం విక్రయించే మహిళ :-** మాది కొత్తవలస మండలం సంతపాలెం గ్రామమని దశాబ్దాల కాలం నుండి కొత్తవలస వారం సొంత వ్యాపారం చేస్తున్నామని మా వద్ద నుండి ఆసీల పేరుతో ప్రతివారం 60 రూపాయల వరకు వసూలు చేస్తున్నారని తగిన రసీదు కూడా ఇవ్వటం లేదని తెలిపారు,



**దుర్గారావు మేకల వ్యాపారి :-** మాది విశాఖ జిల్లా తగరపువలస ప్రాంతమని ప్రతి మంగళవారం వారపు సంతలో మేకల విక్రయించేందుకు వస్తుంటామని మేకకు చిన్న పెద్ద అనే తేడా లేకుండా అమ్ముడైన అమ్మక పోయినా ఆశీర్వాదం తప్పకుండా 30 రూపాయలు కట్టాల్సిందేనని వ్యాపారం జరగలేదు కట్టలేము అంటే ఆశలు వసూలు చేసేవారు ఒప్పుకోరని తెలిపారు,



**గాడి అప్పన్న జొన్నాడ గ్రామం :-** నేను గత 20 ఏళ్ల నుండి కొత్తవలస వారపు సత్తన్న మేకల వ్యాపారం చేస్తున్నానని వారపు సంతలో కావ లసిన మౌలిక వసతులు సైతం ఆసీల పాట దారులు గాని అధికారులు గానీ కల్పించకపోగా ఆసీల వసూళ్లలో మాత్రం బలవంతంగా వసూలు చేస్తున్నారని వ్యాపారం జరగక ఆసీలు కట్టలేమన్నా ఆసిలు కట్టి బయటికి వెళ్లాల్సిందేనని బలవంత పెడుతున్నారని అన్నారు.

# విశాఖ మెడికవర్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవం




**విశాఖపట్నం, ఏప్రిల్ 07 నేటి మనదేశమ్ :** ఈ సంవత్సరం థీమ్ "ఆరోగ్యం కోసం ఐక్యంగా... సైన్స్ కు అండగా " (Together for Health. Stand with Science.) అనే సార్థకమైన సందేశాన్ని అందిస్తోంది. సమాజం మొత్తం కలిసి పనిచేసి, శాస్త్రీయ ఆధారాలపై ఆధారపడి ఆరోగ్యాన్ని కాపాడుకోవడం ఎంత ముఖ్యమో ఈ థీమ్ తెలియజేస్తోంది. ఈ సంవత్సరం ఆరోగ్యంపై అవగాహన పెంపొందించడం, ప్రతి వ్యక్తి సక్రమమైన జీవనశైలిని అలవర్చుకోవడం అత్యంత ముఖ్యమైన అంశంగా నిలుస్తోంది. ఆధునిక జీవనశైలిలో ఒత్తిడి, అనారోగ్యకరమైన ఆహారపు అలవాట్లు, వ్యాయామం లోపం వంటి కారణాల వల్ల అనేక వ్యాధులు పెరుగుతున్నాయి. అందువల్ల ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి. మెడికవర్ హాస్పిటల్స్ ప్రముఖ జనరల్ ఫిజీషియన్ మరియు కన్సల్టెంట్ డాక్టర్ మేఘనాథ్ యెన్ని మాట్లాడుతూ ప్రతి రోజు కనీసం 30 నిమిషాలు వ్యాయామం చేయడం, సమతుల్య ఆహారం తీసుకోవడం, తగిన నిద్రపోవడం వంటి అలవాట్లు మన ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి. ముఖ్యంగా మధుమేహం, రక్తపోటు, గుండె సంబంధిత వ్యాధులు వంటి దీర్ఘకాలిక సమస్యలను నివారించేందుకు క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడం అవసరం . అలాగే మానసిక ఆరోగ్యం కూడా శారీరక ఆరోగ్యంతో సమానంగా ముఖ్యం. ఒత్తిడిని తగ్గించుకోవడం కోసం ధ్యానం, యోగా వంటి పద్ధతులను పాటించడం మంచిది. కుటుంబ సభ్యులతో సమయం గడపడం, సానుకూల ఆలోచనలతో జీవించడం కూడా ఆరోగ్యానికి దోహదపడుతుంది. ప్రతి ఒక్కరూ ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అనుసరించడం ద్వారా మాత్రమే ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించగలం. ఈ ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ఆరోగ్యంపై అవగాహన పెంపొందించి, ఆరోగ్యమే మహాభాగ్యం అనే భావనను ఆచరణలో పెట్టాలని మనమందరం సంకల్పించాలి అని అన్నారు.

# ఘనంగా జరిగిన ఇగ్నో 39వ స్నాతకోత్సవం



**- న్యూఢిల్లీలో కార్యక్రమానికి ముఖ్య అతిథిగా భారత ఉపరాష్ట్రపతి శ్రీ సి. పి. రాధాకృష్ణన్**

**- విశాఖపట్నం కార్యక్రమానికి గౌరవ అతిథిగా ఆంధ్రప్రదేశ్ కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం కులపతి ఆచార్య టి. శ్రీనివాసన్**

**విశాఖపట్నం, ఏప్రిల్ 07 నేటి మనదేశమ్ :** ఇందిరా గాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం (ఇగ్నో) ముప్పై తొమ్మిదవ స్నాతకోత్సవం ఈ రోజు 07.04.2026న ఘనంగా జరిగింది. న్యూఢిల్లీ లోని ఇగ్నో ప్రధాన కార్యాలయంలో గౌరవ భారత ఉపరాష్ట్రపతి శ్రీ సి. పి. రాధాకృష్ణన్ ముఖ్య అతిథిగా జరిగిన ప్రధాన కార్యక్రమాన్ని ఆన్ లైన్ విధానం ద్వారా దేశంలోని అన్ని ప్రాంతాల విద్యార్థులు, ఉద్యోగులు వీక్షించారు. న్యూఢిల్లి లోని కార్యక్రమంలో గౌరవ అతిథిగా ఢిల్లీ గౌరవ లెఫ్టినెంట్ గవర్నర్ శ్రీ తరంజిత్ సింగ్ సంధు విచ్చేశారు. విశాఖపట్నం ఇగ్నో ప్రాంతీయ కేంద్రం పరిధిలో స్థానిక విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో జరిగిన ప్రాంతీయ స్నాతకోత్సవ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం కులపతి ఆచార్య టి. శ్రీనివాసన్ గౌరవ అతిథిగా విచ్చేసి స్నాతకోపన్యాసం చేసి విద్యార్థులకు డిగ్రీ పట్టాలు అందించారు. ఆచార్య శ్రీనివాసన్ తన ఉపన్యాసంలో దూరవిద్య ద్వారా ఉత్తమ విద్యనందించేందుకు అవసరమయిన అన్ని వనరులు విద్యార్థులకు అందిస్తోన్న విశ్వ విద్యాలయం ఇగ్నో అని, ఇగ్నో కోర్సులలో ఇమిడి ఉన్న ప్రత్యేక లక్షణాలు విద్యార్థులను సమాజానికి అవసరమయిన వ్యక్తులుగా మారుస్తాయని అన్నారు. విద్యార్థులు తమ డిగ్రీలద్వారా కేవలం ఉపాధి మాత్రమే కాక, తమ దైనందిన జీవితంలో సమగ్రమైన ఆలోచనలు, వ్యక్తిగత సమగ్రత అలవరచుకోవాలని, జీవితాంతం విద్యార్థులుగా జ్ఞానాన్ని సముపార్జించాలని, జీవితంలోని అన్నిరకాల ఒడిదుడుకులు తట్టుకునే ఆత్మస్థైర్యాన్ని పెంపొందించుకోవాలని, స్వార్థంగా ఆలోచించక, సమాజానికి కట్టుబడి ఉండాలని తద్వారా వసుధైకకుటుంబాన్నిదర్శించవచ్చని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ప్రాంతీయ కేంద్ర సీనియర్ సంచాలకులు డా. గోనిపాటి ధర్మారావు వార్షిక నివేదికను అందిస్తూ ఈ ప్రాంతీయ కేంద్రం పరిధిలోని గ్రామీణ అధ్యయన కేంద్రాలలో విద్యార్థుల అడ్మిషన్లు పెంచడానికి, నిరుద్యోగ గ్రామీణ యువతకు తోడ్పాటు నందించే ఎన్నో కొత్త నైపుణ్యాభివృద్ధి కోర్సులు ప్రారంభించడానికి కృషి చేసినట్లు తెలిపారు. అలాగే వివిధ కొత్తకోర్సులను విశాఖపట్నం ప్రాంతం విద్యార్థులకు కూడా అందుబాటులోకి తెచ్చినట్లు, ఇగ్నో అధ్యయన కేంద్రాలు లేనిచోట కొత్త అధ్యయన కేందాల ఏర్పాటుకు ప్రయత్నాలు ప్రారంభించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా. ఆర్ మంజుల, ఇగ్నో అధ్యయన కేంద్ర సమన్వయకర్త డా. శిరీష, సహ సమన్వయకర్త డా. అనూరాధ, ఇగ్నో విభాగాధికారి శ్రీ వివి పతిరావునాయుడు, శ్రీ నర్సింగ బెహెరా, ఇతర ఉద్యోగులు పాల్గొన్నారు.

# తిరుమలలో అదనపు ఈవో తనిఖీలు

**తిరుమల, ఏప్రిల్ 07 నేటి మనదేశమ్ :** తిరుమలలో కేంద్రీకృత తితిదే పరిపాలనా భవనాన్ని నిర్మించనున్నారు. ఈ నేపథ్యంలో తిరుమల తిరుపతి దేవస్థానం (తితిదే) అదనపు ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరి మంగళవారం తిరుమలలో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా రామ్ భగీచా బస్టాండ్‌కు ఎదురుగా ఉన్న ఖాళీ స్థలాన్ని పరిశీలించారు. అనంతరం ఆకాశగంగ వద్దకు చేరుకున్న అదనపు ఈవో.. దుకాణాలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం శ్రీవారి సేవా సదన్ పక్కన ఉన్న లేబర్ షెడ్లను పరిశీలించారు. అనంతరం తిరుమలలోని...

ఏటీసీ వద్దకు చేరుకున్న ఆయన రెవెన్యూ విభాగానికి కాటేజీ కేటాయింపుపై స్థలాన్ని పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు.

ఈ తనిఖీల్లో తిరుమల ఎస్టేట్ ఆఫీసర్ వేంకటేశ్వర్లు, వీజీవో సురేంద్ర, ఈఈలు శ్రీనివాసరావు, వేణు గోపాల్, డీఈ చంద్రశేఖర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ఘనంగా సోంపురంలో దుర్గమ్మ పండుగ





**వేపాడ, ఏప్రిల్ 07 (నేటి మనదేశమ్) :**మండలంలో సోంపురం గ్రామంలో మహిళా సేవా గరిడి ఆధ్వర్యంలో దుర్గమ్మ పండుగ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని పురవీధుల్లో ఘటాలు తిప్పుతూ భక్తులు అమ్మవారిని భక్తిశ్రద్ధలతో ఆరాధించారు. డప్పు వాయిద్యాల నడుమ " వేకువ జాము నండి" ప్రత్యేక పూజలు నిర్వ హించడం విశేషంగా నిలిచింది. పండుగ సందర్భంగా మందు గుండు సామాగ్రిని కాల్చి ఆనందోత్సాహాలు వ్యక్తం చేశారు. మహిళలు నిర్వహించిన కోలాటం, చూపరాలను ప్రదర్శనలు గ్రామస్థులను ఆకట్టుకున్నాయి. అదేవిధంగా సింహాద్రి అప్పన్న గరిడి సభ్యులు భజనలు చేస్తూ భక్తి వాతావరణాన్ని నెలకొల్పారు. అనంతరం తప్పుడు గుళ్ళతో అమ్మవారిని ఊరేగింపుగా గ్రామమంతా తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని పండగను విజయవంతం చేశారు.

## చోరీ చేసిన బంగారు ఆభరణాలతో

# వ్యక్తిని అదుపులోకి తీసుకున్న పోలీసులు




**కొత్తవలస నీటిమనదేశమ్ ప్రతినిధి :-** కొత్తవలస మండలంలో గత కొంతకాలంగా జరుగుతున్న వరుస దొంగతనాలతో అల్లాడిపోతున్న ప్రజలకు ఎట్టకేలకు కాస్తంత ఉపశమనం లభించింది మార్చి 31 వ తారీఖున కొత్తవలస మండల కేంద్రంలో గల కుమ్మరి వీధిలో తాళం వేసి ఉన్న నివాసంలో చోరీ జరిగిందని కొత్తవలస పోలీస్ స్టేషన్ లో బాధితుడు ఫిర్యాదు చేయగా సీఐ షణ్ముఖ రావు తన సిబ్బందితో గాలింపు చేపట్టారు మంగళవారం ఉదయం కొత్తవలస జంక్షన్ లో అనుమానాస్పదంగా తిరుగుతున్న మైలిపల్లి సంతోష్ కుమార్ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్న సీఐ షణ్ముఖరావు విచారణ జరపగా తన వద్ద కొంత బంగారం వెండి నగలు ఉన్నాయని సమాచారం ఇవ్వడంతో 7:30 తులాల బంగారు నగలు 900 గ్రాముల వెండి ఆభరణాలు స్వాధీనపరచుకోగా అందులో 2025 డిసెంబర్ నెలలో శివాలయంలో జరిగిన దొంగతనంలో ఓ శత కోపం అలానే 2026వ సంవత్సరం ఒకటవ నెలలో కొత్తవలస జంక్షన్ లో గల దుర్గాదేవి అమ్మవారి ఆలయంలో జరిగిన ఒక శతగోపం ఉందని అతనితోపాటు దొంగతనానికి పాల్పడిన ఇంకో ఇద్దరు వ్యక్తుల కోసం తీవ్రంగా గాలిస్తున్నామని త్వరలో వారిని కూడా అదుపులోకి తీసుకుంటామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో...

ఎస్ఐ జోగారావు, ఎస్ ఐ ప్రసాద్ రావు, పాల్గొన్నారు.

# గ్రంథాలయ సంస్థ ను ఆదుకోండి

## ఎంపీ భరత్ ను కలిసిన చైర్మన్ వి సతీష్ కుమార్



**విశాఖపట్నం, ఏప్రిల్ 07 నేటి మనదేశమ్ :** ఉమ్మడి విశాఖపట్నం జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధీనంలో ఉన్న గ్రంథాలయాల స్థితిగతులు మరియు గ్రంథాలయాల సెస్ బకాయిలు మరియు గ్రంథాలయ అభివృద్ధికి చేపట్టవలసిన కార్యక్రమాలు తగు పరిష్కారం కొరకు విశాఖపట్నం పార్లమెంటు సభ్యులు ఎం. భరత్ గారికి వినతి పత్రం సమర్పించిన ఉమ్మడి విశాఖపట్నం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వన్నెం రెడ్డి సతీష్ కుమార్ ఆయన నివాసం లో కలిసి వినతిపత్రం ద్వారా వివరించి ఆదుకోవలసిందిగా కోరారు. దశాబ్దాలుగా విద్యార్థులకు, నిరుద్యోగులకు విజ్ఞాన బాండా గారాలుగా సేవలందిస్తున్న గ్రంథాలయాలను మారుతున్న కాలానికి అనుగుణంగా తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

ప్రధాన విన్నపాలు మరియు సమస్యలు:

శాశ్వత భవన నిర్మాణం: జిల్లా కేంద్ర గ్రంథాలయం , జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యాలయాలు ప్రస్తుతం అధిక అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. సంస్థకు ఉన్న స్వంత నిర్మాణం చేపట్టే వరకు జి వి ఎం సి లేదా వి ఎం ఆర్ డి ఎ తమ పరిధిలో భవనాలను కేటా యించాలని కోరారు. డిజిటల్ గ్రంథాలయాలు: విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని కంప్యూటర్లు, హై-స్పీడ్ ఇంటర్నెట్ మరియు ఈ-బుక్స్ సౌకర్యాలతో కూడిన "డిజిటల్ లైబ్రరీలను" ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. మౌలిక సదుపాయాలు: పాఠకులకు అవసరమైన ఆధునిక ఫర్నిచర్, శుద్ధి చేసిన త్రాగునీరు కొరకు ఆర్. ఓ ప్లాంట్, మరియు మరుగుదొడ్ల సౌకర్యాలను కల్పించాలి. పోటీ పరీక్షల మెటీరియల్: నిరుద్యోగ యువత కోసం గ్రూప్స్, సివిల్స్ వంటి పోటీ పరీక్షలకు సంబంధించిన తాజా ఎడిషన్ పుస్తకాలను అందుబాటులోకి తేవాలని కోరారు. నిధుల విడుదల: జీవీఎంసీ నుండి రావాల్సిన సుమారు రూ. 200 కోట్ల పైగా 'లైబ్రరీ సెస్' బకాయిలను విడుదల చేయించేలా చొరవ తీసుకోవాలని ఎంపీ భరత్ ని కోరారు. నగరంలోని సీతమ్మధార, ఎండాడ, కొమ్మాది వంటి ప్రధాన కూడళ్లలో అందుబాటులో ఉన్న ప్రభుత్వ భవనాలను గ్రంథాలయాల నిర్వహణకు కేటాయిస్తే ప్రజలకు మరింత చేరువలో సేవలు అందించవచ్చని ఈ సందర్భంగా తెలియజేశారు.

# రానున్న 5 రోజుల్లో అధిక ఎండలు - ప్రజలు జాగ్రత్తలు పాటించాలి
## కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్



**కాకినాడ, ఏప్రిల్ 07 (నేటి మనదేశమ్) :** కాకినాడ జిల్లాలోని 14 మండలాల్లో మంగళవారం నుండి రానున్న 5 రోజుల పాటు అధిక ఉష్ణోగ్రతలు నెలకొంటాయని వాతావరణ శాఖ హెచ్చరిక జారీ చేసిన నేపథ్యంలో ప్రజలు వేసవి ఎండలు, వడగాడ్పుల నుండి రక్షణకు అవసరమైన జాగ్రత్తలు పాటించాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ జిల్లా ప్రజలను కోరారు. జిల్లాలోని తాళ్లరేవు, కరప, కాజులూరు, కాకినాడ అర్బన్, రూరల్, పిఠాపురం, యు. కొత్తపల్లి, గొల్లప్రోలు, గండేపల్లి, జగ్గంపేట, కిర్లంపూడి, పెదపూడి, సామర్లకోట, పెద్దాపురం, మండలాల్లో వచ్చే 5 రోజుల్లో 41 డిగ్రీల సెంటీగ్రేడ్ మించి ఉష్ణోగ్రతలు నమోదు కానున్నాయని వాతావరణ శాఖ హెచ్చరిక జారీ చేసిందని ఆయన తెలిపారు. కావున అధిక ఉష్ణోగ్రతలు, వడగాడ్పుల ప్రభావం నుండి రక్షణకు ప్రజలు అప్రమత్తతో ఉండి తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని కోరారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ .... వేసవి ఉష్ణోగ్రతలు పెరగడం వల్ల వేడి గాలుల ప్రభావం అధికంగా ఉండే అవకాశం ఉందని తెలిపారు. వడదెబ్బ నుండి రక్షణ పొందేం దుకు ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వడగాడ్పుల వల్ల డిహైడ్రేషన్ కు గురికాకుండా నీరు, పండ్ల రసాలు, కొబ్బరి నీరు, మజ్జిగ, ఓఅర్ఎస్ వంటి ద్రవ పదార్థాలను ఎక్కువగా తీసుకోవాలని తెలిపారు. ఎండ వేళ సాధ్యమైనంత వరకూ ఆరు బయట సంచరించవద్దని, బయటకి వెళ్లవలసినపుడు ఒదులుగా ఉండే తేలికపాటి, లేత రంగు కాటన్ దుస్తులు ధరించాలని, అలాగే టోపీలు, తలపాగలు, చలువ కళ్లజోళ్లు, గొడుగులు వాడాలని సూచించారు. తలనొప్పి, వాంతులు, విపరీతమైన అలసట, కండరాల తిమ్మిరి, అధిక హృదయ స్పందన రేటు, ముదురు రంగులో మూత్రం రావడం వంటివడదెబ్బ సూచనలు కలిగితే వెంటనే నీడలో లేదా చల్లటి ప్రదేశంలో పడుకోవాలని, తడి గుడ్డతో శరీరాన్ని తుడుస్తూ, చల్లని నీరు లేదా ఓ.ఆర్.ఎస్ తాగించాలని, పరిస్థితి విషమిస్తే వెంటనే సమీప ఆసుపత్రికి తరలించి వైద్యులను సంప్రదించాలని తెలిపారు.

# సాగునీటి సంఘాలదే కీలక బాధ్యత : మంత్రి గుమ్మిడి సంధ్యారాణి



**సాలూరు, ఏప్రిల్ 07 (నేటి మనదేశమ్) :** రైతు సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని, సాగునీటి వినియోగం, నీటి భద్రతలో సాగునీటి సంఘాలు క్రియాశీలక పాత్ర పోషించాలని రాష్ట్ర గిరిజన, స్త్రీ, శిశు సంక్షేమశాఖా మంత్రి గుమ్మిడి సంధ్యారాణి పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన "నీటి భద్రత -- సాగునీటి సంఘాల బాధ్యత" కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారులు, రైతులతో కలిసి సాగునీటి ప్రాజెక్టులు, అభివృద్ధి పనులపై మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈనెల 6నుంచి జూలై 14 వరకు వంద రోజుల పాటు ఈ ప్రత్యేక కార్యక్రమం కొనసాగుతుందని వెల్లడించారు. ఈ కాలంలో క్షేత్రస్థాయిలో సాగునీటి అవసరాలను గుర్తించడం, పెండింగ్‌లో ఉన్న పనులకు నిధులు మంజూరు చేయడం, యుద్ధప్రాతిపదికన పనులను పూర్తి చేయడం లక్ష్యంగా పెట్టుకొని, సాగునీరు సకాలంలో రైతులకు అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆమె ఆదేశించారు. నియోజకవర్గ అభివృద్ధి, సంక్షేమానికి ప్రభుత్వం ఈ ఏడాది రూ.490 కోట్లు కేటాయించిందని మంత్రి తెలిపారు. అనంతరం పిజిఆర్ఎస్ ద్వారా వచ్చే ప్రజా సమస్యలను అధికారులు నిర్లక్ష్యం చేయకుండా పరిష్కరించాలని ఆమె ఆదేశించారు. సమావేశంలో సబ్ కలెక్టర్ ఆర్ వైశాలి, డ్వామా పీడీ కె.రామచంద్రరావు, మున్సిపల్, మండల, నియోజకవర్గ స్థాయి అధికారులు, సాగునీటి సంఘాల ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు

**.నీటి నిల్వ సామర్థ్యం పెంచడమే : కలెక్టర్**

'జలధార' కార్యక్రమం ద్వారా రాబోయే వంద రోజుల్లో నిర్దిష్ట లక్ష్యాలతో నీటి సంరక్షణ పనులను పూర్తి చేయాలని కలెక్టర్ డాక్టర్ ఎన్ ప్రభాకర రెడ్డి ఆదేశించారు. జలవనరుల శాఖ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన నీటి భద్రతా సాగునీటి సంఘ బాధ్యత వంద రోజుల కార్యక్రమానికి కలెక్టర్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ స్థాయిలో సాగునీటి సంఘాల అధ్యక్షులు, కార్యదర్శులు, సభ్యులు క్రియాశీలక పాత్ర పోషిం చాలని, గ్రామంలో నీటి నిల్వను పెంచడానికి, వృథాను అరికట్ట డానికి ఉన్న అవకాశాలను గుర్తించి నివేదికలు సమర్పించాలని సూచించారు. పాడైన చెరువు తూములు, పూడికతో నిండిన కాలువలను గుర్తించి వాటిని బాగు చేయడం, గతంలో ఉన్న ఆయకట్టును పునరుద్ధరించడమే కాకుండా, చెరువుల్లో పూడిక తీయడం ద్వారా నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచి అదనపు ఆయకట్టుకు నీరు అందించడమే ధ్యేయమని పేర్కొన్నారు. చెరువులు, కాలువల ఆక్రమణలను గుర్తించి, వాటిని తొలగించేలా గ్రామస్తులు సహకరించాలన్నారు. జిల్లాలో దాదాపు 2,900 చెరువులను గుర్తించి, వాటి చుట్టూ ఆక్రమణలు జరగకుండా ఉపాధి హామీ పథకం కింద ఫెన్సింగ్ వేయడం, చుట్టూ మొక్కలు నాటడం వంటి పనులు చేపట్టనున్నామని, దీనివల్ల చెరువుల సరిహద్దులు స్పష్టంగా తెలియడమే కాకుండా పర్యావరణ పరిరక్షణ జరుగుతుందని చెప్పారు. కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి మాట్లాడుతూ వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేస్తూ, సాగునీటి వనరుల సమర్థ వినియోగమే ధ్యేయంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'నీటి సంఘాల బాధ్యత' కార్యక్రమం ఉత్సాహంగా ప్రారంభమైందన్నారు.. ముఖ్యంగా చెరువుల పరిస్థితి, నీటి నిల్వ సామర్థ్యం, ఎండిపోయిన వనరులను పునరుద్ధరించడంపై దృష్టి సారించాలని సూచించారు. మేజర్, మైనర్ కాలువలతో పాటు చెక్ డ్యామ్‌ల మరమ్మతులపై కూడా ప్రత్యేక నివేదికలు అందించాలని కోరారు. పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర మాట్లాడుతూ జిల్లాలోని జల వనరులను పునరుద్ధరించడం, భూగర్భ జలమట్టాన్ని పెంచడమే లక్ష్యంగా 'వంద రోజులు - నీటి భద్రత' అనే వినూత్న కార్యక్రమాన్ని అధికార యంత్రాంగం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ సి. యశ్వంత్ కుమార్ రెడ్డి, ప్రజా ప్రతినిధులు, నీటి సంఘాల చైర్మన్లు, నీటిపారుదల శాఖ అధికారులు పాల్గొన్నారు.

# రాష్ట్ర మహాసభను జయప్రదం చేయాలి



**అమలాపురం, ఏప్రిల్ 07 (నేటి మనదేశమ్) :** అఖిలభారత అధ్యక్ష, కార్యదర్శులు, ఐదు రాష్ట్రాల అధ్యక్ష, కార్యదర్శులు, రాష్ట్రంలోని 28 జిల్లాల నుంచి వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన నాయకత్వం హాజరవుతున్న వ్యవసాయ కార్మిక సంఘం 30వ రాష్ట్ర మహాసభను జయప్రదం చేయా లని ఆహ్వాన సంఘం అధ్యక్షులు మాజీ ఎంఎల్‌సి ఇళ్ల వెంకటేశ్వరరావు ఐవి, ఆహ్వాన సంఘం గౌరవ అధ్యక్షులు సివి.రామన్ విద్యాసంస్థలు ఛైర్మన్ రవణం వేణుగోపాల్ పిలుపు నిచ్చారు. మంగళవారం అమలాపురం సివి.రామన్ పాఠశాలలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర మహాసభ కరపత్రం ఆవిష్కరణ సభ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఐవి మాట్లాడుతూ మే 6, 7, 8 తేదీల్లో స్థానిక గడియార స్తంభం సెంటర్ గంగరాజు ఫంక్షన్ హాల్‌లో 30వ రాష్ట్ర వ్యవ సాయ కార్మిక సంఘం మహాసభ నిర్వహి స్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం పేరును విబిజి ఆర్ఎంజిగా మార్చడం వెనక కేంద్రం లోని బిజెపి ప్రభు త్వం కుట్ర దాగి ఉందని అలాగే ఉపాధి హామీ చట్టం నిధులు తగ్గించడం దారుణ మని మాజీ ఎంఎ ల్‌సి ఐవి అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న వ్యవసాయ కార్మికుల ఐక్యతను బలోపేతం చేయడం, వారి హక్కులను సాధించడం లక్ష్యంగా రాష్ట్ర వ్యవసాయ కార్మిక సంఘం మహాసభ జిల్లాలో నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు మాట్లాడుతూ ఈ మహాసభకు రాష్ట్రంలో వివిధ జిల్లాల నుంచి వేలాది మంది వ్యవసాయ కార్మికుల హాజరవుతారన్నారు. కార్మికుల ఎదుర్కొం టున్న సమ స్యలైన కనీస వేతనాలు, సంవత్సర మంతా ఉపాధి కల్పించడం, గృహాలు, పింఛన్లు వంటి వ్యవసాయ కార్మికుల సంక్షేమంపై పెద్ద ఎత్తున పోరా టాలు చేయాలని పిలుపునిచ్చారు. వ్యవ సాయ కార్మిక సంఘం రాష్ట్ర మహాసభల ఆహ్వాన సంఘం గౌరవ అధ్యక్షులు రవణం వేణుగోపాల్, ఉపాధ్యక్షులు సుధా గణపతి, సప్పా నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి కారెం వెంకటేశ్వరరావు మాట్లాడుతూ జిల్లాలో మూడు రోజులు పాటు జరిగే ఈ మహాసభకు వ్యవసాయ కార్మిక సంఘం అఖిలభారత నాయకత్వం బి. వెంకట్, విజయ రాఘవన్ తమిళనాడు, కేరళ , తెలంగాణ తదితర రాష్ట్రాల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు రాష్ట్రంలోని 28 జిల్లాల నుంచి వ్యవ సాయ కార్మిక ఉద్యమ నాయకత్వం హాజరవు తారన్నారు. ఆతిథ్యం ఇవ్వాల్సిన బాధ్యత మనందరి పైన ఉందని మొదటి రోజు జరిగే భారీ బహిరంగ సభ ప్రదర్శన కూడా జయప్రదం చేయాలన్నారు. దీనికోసం జిల్లాలో ప్రము ఖులు మేధావులు, ఉద్యోగ, ఉపాధ్యాయ కార్మికులు ప్రజాప్రతినిధులు వర్తక సంఘాలు ఈ రాష్ట్ర మహా సభకు ఆర్థిక, హార్థిక సహాయ సహకారాలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి సకిలే సూర్య నారాయణ, సహాయ కార్యదర్శి ఇసుక పట్ల మంగా దేవి, సిఐటియూ అధ్యక్షులు జి.దుర్గాప్రసాద్ జిల్లా నాయకులు పి.శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.



# మార్చి నెల జీతం వెంటనే ఇవ్వాలి

**మన్యం జిల్లా, ఏప్రిల్ 07 (నేటి మనదేశమ్) :** మార్చి నెల వేతనాలు నేటికీ మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికులకు చెల్లించకపోవడం అన్యాయమని, వెంటనే వారి ఖాతాల్లోకి చెల్లించాలని మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ నాయకులు డిమాండ్ చేశారు. ఫెడరేషన్ రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా సోమవారం సిఐటియు జిల్లా కోశాధికారి గొర్లి వెంకటరమణతో కలిసి మున్సిపల్ ఆఫీసు ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ ఎన్.రామారావుకు వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా వెంకటరమణ, మున్సిపల్ ఫెడరేషన్ అధ్యక్ష కార్యదర్శులు సిహెచ్ సింహాచలం, ఎన్.శంకరరావు మాట్లాడుతూ ప్రస్తుత ధరలు విపరీతంగా పెరుగుతున్న నేపథ్యంలో కార్మికుని నెల జీతం చెల్లింపుపై రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడం అన్యాయమని అన్నారు. వెంటనే వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. 60ఏళ్లకు రిటైర్ అయిన కుటుంబాలకు ఉద్యోగాలు ఇవ్వాలని, చనిపోయిన కార్మికుని కుటుంబాలకు ఉద్యోగాలు కల్పించాలని, 62 ఏళ్లకు రిటైర్మెంట్ వయస్సు పెంపు, చనిపోయిన కుటుంబాలకు నష్టపరిహారం ఇవ్వాలని, పిఆర్సి, కార్మికుల జీతాలు పెంచాలని, ప్రభుత్వమే నేరుగా కార్మికులకు జీతాలు చెల్లించాలని, పట్టణ విస్తరణను గుణంగా కార్మికుల సంఖ్యను పెంచాలని, కార్మికుల పనిముట్లను వాహనాలను మరమ్మతులు చేపట్టాలని, పర్మినెంట్ కార్మికులకు రెండేళ్ల కుట్టుకూలి డబ్బులివ్వాలని, పారిశుధ్య పని నిమిత్తం శంబర యాత్రకు వెళ్లిన కార్మికులకు ఇవ్వాల్సిన డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేశారు. లేకుంటే భవిష్యత్తులో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతా మని హెచ్చరించారు. కార్యక్రమంలో ఫెడరేషన్ నాయకులు రాజశేఖర్, పి.వరదరాజు, బి.రవి, యం.శివ, గంగేలు, గుంపుస్వామి, శారద, లక్ష్మీ, పాపమ్మ, సుజాత, ఇప్పలమ్మ తదితరులు పాల్గొన్నారు.

**సాలూరు :** మున్సిపల్ కార్మికుల జీతాలు చెల్లింపులో ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిరసిస్తూ ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆధ్వర్యాన స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట కార్మికులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఫెడ రేషన్ సాలూరు కమిటీ అధ్యక్ష కార్యదర్శులు టి.శంకరరావు, టి.రవి మాట్లాడుతూ ప్రభు త్వం ముందు చూపు లేకుండా మున్సిపల్ కార్మికుల జీతాల చెల్లింపులకు సంబంధించి కొత్త విధానాలు తీసుకువస్తుందని, అందువల్లే మార్చి నెల జీతాలు నేటికీ బిల్లులు పెట్టని పరిస్థితి నెలకొందన్నారు. కాంట్రాక్టు కార్మికులకు రాష్ట్రంలో అనేక మున్సిపాలిటీల్లో నిధులు లేకపోవడంతో జీతాల కొరత ఉందని, ఈ విషయాన్ని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి దృష్టిలో యూనియన్లు ఇప్పటికే పెట్టినా స్పందనలేదని ఆందోళన వ్యక్తం చేశారు.

# అంబేద్కర్ జయంతిని విజయవంతం చేయాలి



**అమలాపురం, ఏప్రిల్ 07 (నేటి మనదేశమ్) :** స్థానిక పేరూరు వై జంక్షన్ సెంటర్‌లో ఎస్సి, ఎస్టి, బిసి, ఒసి మైనారిటీ, మహిళా సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించే ఏప్రిల్ 14 సాయంత్రం 7 గంటలకు నిర్వహించే డాక్టర్ బిఆర్.అంబేద్కర్ 135వ జయంతి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పలువురు నాయకులు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ముఖ్యనాయకులు మాట్లాడుతూ అంబేద్కర్ అందరి వాడన్నారు. ఆయన త్యాగం తో ఏర్పడిన భారత రాజ్యాంగం అన్ని వర్గాలకు, అన్ని వ్యవస్థలకు రక్షణ కల్పిస్తుందన్నారు. కాబట్టి కుల, మత, ప్రాంతీయ విభేదాలు లేకుండా అందరూ కలిసి అంబేద్కర్ జయంతి నిర్వహించడం మనందరి బాధ్యత అని అన్నారు. కార్యక్రమంలో డిబి.లోక్, ఎంఎకె. భీమారావు, కొత్తూరి శ్రీనివాస్, షేక్ ఖాదర్, అరవ చంటి, సంసాని వెంకట రత్నకుమార్, అయితాబత్తుల సుభాషిణి, పెయ్యల పరశురాముడు, పెయ్యల శ్రీనివాసరావు, ఎండి. షకీలా, జల్లి శ్రీనివాసరావు, నక్కా సంపత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# 194 ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు



**ఆత్రేయపురం, ఏప్రిల్ 07 (నేటి మనదేశమ్) :** ల్లరైతు కష్టానికి సరైన ప్రతిఫలం అందాలనే ఆశయంతో జిల్లాలో 194 ధాన్యం కొను గోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ తెలిపారు. ఆత్రేయ పురంలో ఎంఎల్ఎ బండారు సత్యానంద రావుతో కలిసి ఆయన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ప్రప్రథమంగా ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. రైతుల కష్టానికి సరైన ప్రతిఫలం అందాలనే ఆశయంతో ప్రభుత్వం ఈ సౌలభ్యం కల్పించిందన్నారు. గతం లో రైతులు పండించిన పంటను అమ్ముకోవడానికి దళారులపై ఆధారపడి మోసపోయేవారని, ప్రస్తుతం నేరుగా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారా మద్దతు ధర పొందే అవకాశం కలిగిందన్నారు. మద్దతు ధరకు భరోసా కల్పిస్తూ ప్రభుత్వం నిర్ణయించిన కనీస మద్దతు ధర నేరుగా రైతు ఖాతాల్లోకే 24 గంటలలోపే జమ అవుతుందన్నారు. దీనివల్ల ప్రతి గింజకూ తగిన విలువ దక్కుతుందన్నారు. ఈ కేంద్రాల్లో ధాన్యం సేకరణకు అవసరమైన తేమ యంత్రాలు, తూకం మిషన్లు, గన్నీ బ్యాగులను సిద్ధం చేశామన్నారు. ఎంఎల్ఎ బండారు సత్యానందరావు మాట్లాడుతూ రైతు సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం రైతు శ్రేయస్సుకు పెద్దపీట వేస్తోందన్నారు. కోనసీమలో పండే ప్రతి వరి గింజ రైతుకు లాభాన్ని చేకూర్చాలనీ ఆకాంక్షించారు. ఎపి సివిల్ సప్లయి కార్పొరేషన్ ఛైర్మన్ తోట సుధీర్ మాట్లాడుతూ పౌర సరఫరాల శాఖ ధాన్యం కొనుగోలుకు పారదర్శక విధానాలను అవలంభిస్తుందన్నారు. రైతుల నుంచి ధాన్యం కొనుగోలు సంబంధించి ఎటువంటి అసంతృప్తి లేదన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రైస్ మిల్లర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ డి.లక్ష్మీనారాయణ, పౌరసరఫరాల జిల్లా మేనేజర్ పి.శ్రీనివాస్, జిల్లా పౌర సరఫరాల అధికారి ఎ.ఉదయ భాస్కర్, జిల్లా వ్యవసాయ అధికారి రామారావు, స్థానిక ప్రజా ప్రతినిధులు, నీటి సంఘాల అధ్యక్షులు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు. అనంతరం లొల్ల లాకుల వద్ద 100 రోజుల యాక్షన్ ప్లాన్ కార్యక్రమాన్ని ఎంఎల్ఎతోపాటు, కలెక్టర్ ప్రారంభించారు.

# ట్రాఫిక్ పోలీసులకు సమ్మర్ కిట్‌లు పంపిణీ



**విజయనగరం, ఏప్రిల్ 07 (నేటి మన దేశమ్) :** వేసవిలో తీవ్ర ఎండల దృష్ట్యా ఉపశమనం పొందడానికి సుమారు రూ.1లక్ష విలువైన హ్యాట్స్, వాటర్ బాటిల్, బ్యాగుతో కూడిన సమ్మర్ కిట్‌లను ట్రాఫిక్ పోలీసు స్టేషనులో పని చేసే, ఎఎస్ఐలు, హెచ్‌సిలు, కానిస్టేబుళ్లకు ఎస్‌పి ఎఆర్ దామోదర్ సోమవారం అందజేశారు. పోలీసు సిబ్బంది సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని, ట్రాఫిక్ రద్దీ ఎక్కువగా ఉండే వేళలను మినహాయించి, ట్రాఫిక్ విధులు నిర్వహించే పోలీసు సిబ్బంది పని గంటలను మార్పులు చేయాలని ట్రాఫిక్ సిఐని ఆదేశించారు. ప్రజలకు నిరంతరం సేవలందించడంతో పాటు, రోగ్యంపై కూడా ప్రత్యేకంగా శ్రద్ద పెట్టాలని, తరుచూ వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. వేసవిలో ఎండ తీవ్రతను ఎదుర్కొనేందుకు, డీహైడ్రేషన్ కు గురికాకుండా తరుచూ మంచి నీళ్ళు, మజ్జిగ, ఒఆర్ఎస్, గ్లూకోజ్ తాగాలని తెలిపారు. ట్రాఫిక్ సిగల్ పాయింట్స్ వద్ద వాహనదారులు ఎక్కువ సమయం ఎండలో వేచి ఉండకుండా సిగల్ టైమింగ్సు తగ్గించే విధంగా చర్యలు చేపట్టాలని ట్రాఫిక్ సిఐకి సూచించారు. కార్యక్రమంలో డిఎస్‌పి ఆర్.గోవిందరావు, ట్రాఫిక్ సిఐ సూరి నాయుడు, ఎస్బి సిఐ ఎవి లీలారావు, ట్రాఫిక్ ఎస్ఐలు ఎస్.భాస్కరరావు, చిన్నారావు పాల్గొన్నారు.

## బంగారానికి ఆశపడి .. వృద్ధురాలిని చంపిన బంధువులు




**చీపురుపల్లి (విజయనగరం) :** చెరువులో పాతిపెట్టిన ఘటన పోలీసుల దర్యాప్తులో వెలుగు చూసింది. మంగళవారం స్థానిక వివరాల మేరకు ... చీపురుపల్లి మండలం గొల్లపాలెం గ్రామంలో గొర్లె చిన్నప్పమ్మ (65) ను అదే గ్రామానికి చెందిన ఆమె మేనల్లుడు వరుసైన ఎజ్జుపారపు రమణ, చందక రమణ అనే ఇద్దరు వ్యక్తులు కలిసి ఆమె బంగారానికి ఆశపడి చంపేసినట్లు స్థానికులు తెలిపారు. ఈ ఏడాది ఫిబ్రవరి 23వ తేదీన వఅద్ధురాలిని గొల్లపాలెం గ్రామానికి సమీపంలో గల ఒక చెరువులో పాతిపెట్టారు. దీంతో మృతురాలి అల్లుడు రెడ్డి పాపునాయుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు ఈ కేసును ఛేదించారు.

# బైకర్ స్పీడ్ ఇంకా పెరగాలి



శర్వానంద్ హీరోగా అభిలాష్ రెడ్డి దర్శకత్వంలో రూపొందిన బైకర్ తొలి రెండు రోజులు నెమ్మదిగానే నడిచింది. టాక్ స్లోగా ఉండటం, యూత్ మద్దతు ఎక్కువగా రాకాసకు కనిపించడం లాంటి కారణాలు కొంత ప్రభావితం చేశాయి. అయితే అనూహ్యంగా బైకర్ వీక్ డేస్ లో పికప్ అయ్యింది. గత ఇరవై నాలుగు గంటల్లో బుక్ మై షోలో బైకర్ సగటున 15 వేలకు పైగా టికెట్లు అమ్మగా రాకాస కొంచెం వెనుకబడి 13 వేల పైచిలుకు దగ్గర ఉంది. ఆదివారం దాకా ఇది రివర్స్ లో నడిచింది. అయితే వీటిని బట్టి బైకర్ ఏదో బ్లాక్ బస్టర్ అయిపోతుందని వెంటనే తేల్చలేం. ఎందుకంటే ఇప్పుడీ పికప్ ని మరింతగా పెంచుకుని వచ్చే ఆదివారం దాకా స్పీడ్ కొనసాగించాలి. కానీ శుక్రవారం డెకాయిట్, లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ, పళ్ళి చట్టంబి లాంటి కొత్త రిలీజులు ఉన్నాయి కాబట్టి వాటి ఎఫెక్ట్ ఎంత ఉంటుందనే దాన్ని బట్టి వసూళ్ల లెక్కలు ఉంటాయి. నిర్మాణ సంస్థ అధికారికంగా ప్రకటించిన దాని ప్రకారం బైకర్ ఫస్ట్ వీకెండ్ కి పద్దెనిమిది కోట్ల గ్రాస్ దాటేసింది ఇది నిజమైన పక్షంలో బ్రేక్ ఈవెన్ కి ఇంకా సగం దూరం పైనే ప్రయాణం చేయాల్సి ఉంటుంది. ఇది అంత ఈజీ కాదు. బ్లాక్ బస్టర్ టాక్ వస్తే అసాధ్యం కాదు కానీ బైకర్ కు వచ్చింది డీసెంటనే మాట మాత్రమే. సో కొంచెం గట్టి యుద్ధమే చేయాల్సి ఉంటుంది. ఐపీఎల్ ప్రభావం కూడా గట్టిగానే ఉంది. ఇంకోవైపు రాకాస అనూహ్యంగా నెమ్మదించడం ఊహించనిది. టీమ్ ప్రమోషన్లు కొనసాగిస్తోంది. సిడెడ్ నుంచి సక్సెస్ టూర్ మొదలుపెట్టి అన్ని ప్రాంతాలకు వెళ్తోంది. శర్వానంద్ చెప్పుకున్నట్టు బైకర్ తన పెర్ఫార్మన్స్ పరంగా కెరీర్ బెస్ట్ అవ్వొచ్చేమో కానీ కమర్షియల్ గా ఎంత మేర సేఫ్ అవుతుందనేది ఇంకో వారం ఆగాక క్లారిటి వస్తుంది. యువి క్రియేషన్ దీని మీద నలభై కోట్ల దాకా బ్రేక్ ఈవెన్ టార్గెట్ పెట్టుకుంది. అన్ని వర్గాల ఆడియెన్స్ మద్దతు దొరికితే ఇదేమి అసాధ్యం కాదు. కాకపోతే బిసి సెంటర్స్ లో స్లోగా ఉండటం, నెంబర్లు ఆశించినంత పెద్ద స్థాయిలో పెరగకపోవడం బైకర్ ఎదురుకుంటున్న చాలా పెద్ద సవాల్.


# రావణుడిని అంత గొప్పగా చూపించగలరా



ఇటీవలే విడుదలైన రామాయణ పార్ట్ 1 టీజర్ మీద మిశ్రమ స్పందన వచ్చిన సంగతి తెలిసిందే. సోషల్ మీడియా ఫీడ్ బ్యాక్ ఎలా ఉన్నా టీమ్ మాత్రం తామో గొప్ప అద్భుతాన్ని చూపించిన ఫీలింగ్ లో ఉంది. ఇదిలా ఉండగా దర్శకుడు నితేశ్ తివారి ఈ సినిమాకు సంబంధించిన పలు ఆసక్తికరమైన కబుర్లు పంచుకున్నారు. ముఖ్యంగా యష్ పోషించిన రావణుడి పాత్ర గురించి ఓ రేంజ్ ఎలివేషన్లు ఇస్తున్నారు. నెగటివ్ కన్నా ఎక్కువగా పాజిటివ్ ఉంటుందని ఊరిస్తున్నారు. రావణుడిని కేవలం సీతను అపహరించిన కోణంలో కాకుండా తనలో ఉన్న వీరత్వం, సంగీత కళ, శివ భక్తి తత్వం, ప్రజలను చక్కగా పాలించిన వైనం లాంటివి చూపించబోతున్నట్టు చెప్పారు. స్వార్థం, పరస్త్రీ మీద వ్యామోహం మనిషి పతనానికి ఎలా దారి తీస్తాయో ఒక పాఠం రూపంలో ప్రేక్షకులకు వివరిస్తామని అంటున్నారు. కెజిఎఫ్, టాక్సిక్ తర్వాత యష్ ఒప్పుకున్న మూవీ ఇదే. రావణుడిగా అయినా సరే గ్రీన్ సిగ్నల్ ఇవ్వడానికి కారణం నితేశ్ తివారి నేరేషనే. అయితే రావణుడికి సంబంధించి ఒక గొప్ప క్యారెక్టరైజేషన్ చూపించిన నటుల్లో ముందుగా చెప్పుకోవాల్సింది స్వర్గీయ ఎన్టీఆర్ గురించే. సీతారామకళ్యాణం, భూకైలాస్ లో ఆయన చూపించిన వేరియేషన్లు వాటిని మరపురాని మాస్టర్ పీసెస్ గా చేశాయి. తర్వాత సంపూర్ణ రామాయణంలో ఎస్వి రంగారావు రావణుడిగా ప్రాణ ప్రతిష్ట చేశారు. తర్వాత ఇంకెవరు ఈ స్థాయిలో ప్రభావం చూపించిన నటులు లేరు. ఆదిపురుష్ లో సైఫ్ అలీఖాన్ ని గుర్తు చేసుకోకపోవడం ఉత్తమం. సో రామాయణ వచ్చినప్పుడు ఖచ్చితంగా ఇలాంటి పోలికలు వస్తాయి. యష్ లోని అసలైన నటుడిని కూడా ఈ సందర్భంగానే బయటికి తీయొచ్చు. ఒకవేళ ఒకనాటి క్లాసిక్స్ ని గుర్తు చేసే స్థాయిలో కనక యాక్టింగ్ చేయగలిగితే అవార్డులకు ఆకాశమే హద్దు అవుతుంది. నితేశ్ తివారి అంత గొప్పగా పాత్ర చిత్రణ చేశారా లేదానేది ఇక్కడ కీలకం కానుంది. ఏఆర్ రెహమాన్, జిమ్స్ హ్యేమర్ సంగీతం సమకూరుస్తున్న ఈ విజువల్ గ్రాండియర్ లో రన్బీర్ కపూర్, సాయిపల్లవి సీతారాములుగా నటిస్తున్నారు.





# పెద్ది... పెద్ద మనసు చేసుకుని చెప్పేసెయ్



ఇండస్ట్రీ, ప్రేక్షకులు అందరూ ఎదురు చూస్తున్న క్షణం పెద్ది అనౌన్స్ మెంట్. ఏప్రిల్ 30 రావడం లేదని ప్రపంచం మొత్తం కోడై కూస్తున్నా నిర్మాణ సంస్థలు మాత్రం పెదవి విప్పడం లేదు. దీనికి తోడు రామ్ చరణ్ మొన్న రాకాస ఇంటర్వ్యూలో లేట్ లేదని చెప్పడం, ట్విట్టర్ వేదికగా డిస్ట్రిబ్యూటర్ల లిస్టు ఒక్కొక్కటిగా బయటికి రావడం అనుమానాలు పెంచుతున్నాయి తప్పించి తగ్గించడం లేదు. దీని వల్ల బయ్యర్లు ఏమో కానీ అభిమానులు ఒత్తిడికి గురవుతున్నారు. తాజా సమాచారం మేరకు పెద్ది ఏప్రిల్ 30 రావడం లేదు. ఎలాంటి టెన్షన్ లేకుండా తగినంత సమయం దొరికేలా జూన్ 4 లేదా జూన్ 25 రెండు ఆప్షన్ల మీద కసరత్తు చేస్తున్నారట. మొదటి డేట్ కి టాక్సిక్ ఉంది కాబట్టి జూన్ మూడో వారానికి షిఫ్టయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ఒకవేళ యష్ రానంటే మాత్రం రామ్ చరణ్ రంగంలోకి దిగవచ్చు. పెద్ది ప్రకటన రాగానే మా ఇంటి బంగారం, స్వయంభు లాంటివి డేట్లు వేసుకోవడానికి రెడీగా ఉన్నాయి. గాయపడ్డ సింహం ఆల్రెడీ మే 1 వస్తుంది. సో ఇంత క్లారిటీ బయటి వర్గాలకు ఉన్నప్పుడు ప్రొడక్షన్ హౌస్ వీలైనంత త్వరగా స్పందిస్తే మంచిది. ప్రస్తుతం ఐటెం సాంగ్ ఏర్పాట్లలో బిజీగా ఉన్న దర్శకుడు బుచ్చిబాబు అందులో ఎవరు డాన్స్ చేస్తారనేది బయట పెట్టడం లేదు.

# మాస్ మసాలా వదలని నాగశౌర్య




రంగబలి తర్వాత నాగశౌర్య తెరమీద కనిపించి రెండేళ్లు దాటిపోయింది. వరస డిజాస్టర్లతో మార్కెట్ డ్యామేజ్ అయిన టైంలో సరైన కంబ్యాక్ కోసం అభిమానులు ఎదురు చూస్తున్నారు. ఛలో తర్వాత మళ్ళీ అంత పెద్ద హిట్టు తనకు దక్కపోవడం విచిత్రమే. ఇదిలా ఉండగా నాగ శౌర్య కొత్త మూవీ బ్యాడ్ బాయ్ కార్తీక్ ఈ నెల ఏప్రిల్ 17 విడుదలకు రెడీ అవుతోంది. ఈ సందర్భంగా ట్రైలర్ లాంచ్ చేశారు. తెలిసో తెలియకో తప్పులు చేశామని నిర్మాత హీరోకు సారి చెప్పడం వైరల్ అవుతోంది. ఇక ట్రైలర్ విషయానికి వస్తే నాగశౌర్య ఈసారి కూడా ఓవర్ మాస్ ట్రై చేసినట్టు ఉన్నాడు. అన్యాయాన్ని సహించని హీరో, ఒక అవినీతి రాజకీయ నాయకుడు, ఒక మాఫియా డాన్, జులాయిలో రాజేంద్ర ప్రసాద్ లాంటి ఒక కామెడీ పోలీస్ ఆఫీసర్ వెరసి పక్కా ఫార్ములా తరహాలో కంటెంట్ వెళ్ళిపోయింది. ఒక షాట్ లో నాగశౌర్య కత్తి పట్టుకుని రౌడీల మీదకు వస్తుంటే వెనుక నరసింహస్వామి స్వరూపాన్ని బ్యాక్ షాట్ లో చూపించడం బోయపాటి శీనుని గుర్తు చేసింది.

# డెకాయిట్ అంచనాల మీటర్ ఎలా ఉంది



ఇంకో మూడు రోజుల్లో డెకాయిట్ థియేటర్లలో అడుగు పెట్టేస్తాడు. హైదరాబాద్ లాంటి మెయిన్ సెంటర్స్ అడ్వాన్స్ బుకింగ్స్ మొదలైపోయాయి. టికెట్ల అమ్మకాలు బాగానే ఉన్నాయి. అన్ని చోట్ల ఓపెన్ అయ్యాక ట్రెండింగ్ ఏ స్థాయిలో ఉందనేది క్లారిటీ వస్తుంది. అయితే ట్రైలర్ వచ్చాక డెకాయిట్ సౌండ్ కొంచెం తగ్గిందనే కామెంట్స్ సోషల్ మీడియాలో వినిపిస్తున్నాయి. కథని రివీల్ చేసినప్పటికీ ఫాస్ట్ గా కట్ చేసిన విధానం మాస్ కు అంతగా రీచ్ కాలేదన్నది నెటిజెన్స్ టాక్. డెకాయిట్ మీద ముందు నుంచి మంచి యాక్షన్, ఛేజింగ్ సినిమానే అంచనాలు ఆడియన్స్ లో బలంగా ఉన్నాయి. అయితే కొత్తగా లవ్ స్టోరీ యాంగిల్ లో ప్రమోట్ చేయడంతో ఫ్యామిలీ, యూత్ ఆడియన్స్ ని టార్గెట్ చేసిన వైనం కనిపిస్తోంది. డెకాయిట్ కి ఈ వారం మంచి అవకాశం ఉంది. బైకర్, రాకాసలు డీసెంట్ టాక్ తో కొంత మేర నెట్టుకొస్తున్నాయి కానీ ఎక్స్ ట్రాడినరి టాక్ రాకపోవడం కలెక్షన్లను ప్రభావితం చేస్తోంది. దీన్ని డెకాయిట్ పూర్తిగా వాడుకోవాలి. అడివి శేష్ మీద ఉన్న నమ్మకం ఓపెనింగ్స్ కి దోహదపడుతుంది. హిట్ 2 ది సెకండ్ కేస్ తర్వాత శేష్ మళ్ళీ స్క్రీన్ మీద కనిపించలేదు. అందుకే డెకాయిట్ మీద జనాల్లో స్పెషల్ ఇంట్రస్ట్ ఉంది. దర్శకుడు షానియేల్ డియో ఎవరికీ తెలియదు. సో ఆ బ్రాండ్ పనిచేయదు. భీమ్స్ సిసిరోలియో ఇచ్చిన పాటలు కూడా మరీ ఛార్ట్ బస్టర్ కాదు. బాగానే ఉన్నాయి కానీ వైరల్ అయ్యే స్థాయిలో లేకపోవడం కొంత మైనస్ అయ్యింది. విజువల్ గా క్లిక్ అవుతాయేమో చూడాలి. పోటీపరంగా డెకాయిట్ పెద్ద రిస్క్ లో లేదు. లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ కేవలం ప్రదీప్ రంగనాథన్ ఫేస్ వేల్యూ మీద బిజినెస్ చేస్తోంది. అయితే అర్థమయ్యి కానట్టు ట్రైలర్ లో చూపించింది అంచనాలు పెంచలేకపోయింది. ఇక పల్లి చట్టంబిలో మలయాళ ఫ్లేవర్ మనోళ్ళకు ఎంత మేరకు కనెక్ట్ అవుతుందనేది అనుమానంగానే ఉంది. లక్కీగా అక్షయ్ కుమార్ భూత్ బంగ్లా ఒక వారం వాయిదా పడటం హిందీ మార్కెట్లలో ఉపయోగపడుతుంది. హిట్ టాక్ వస్తే పండగే.




# నాలుగోరోజూ లాభాల్లో సూచీలు.. 23వేల ఎగువకు నిఫ్టీ



దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు వరుసగా నాలుగోరోజూ లాభాల్లో ముగిశాయి. ఉదయం నష్టాల్లో ప్రారంభమైన సూచీలు.. కనిష్ఠాల వద్ద కొనుగోళ్ల మద్దతుతో రాణించాయి. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ బెదిరింపులతో ఉదయం ఓ దశలో సెన్సెక్స్ 800 పాయింట్లు నష్టపోయింది. మధ్యాహ్నం తర్వాత సీన్ మారింది. క్రూడాయిల్ ధరలు తగ్గుముఖం పట్టడం, అంతర్జాతీయ మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలతో మన మార్కెట్ సూచీలూ రాణించాయి. ముఖ్యంగా ఐటీ స్టాక్స్‌లో కొనుగోళ్ల మద్దతు కలిసొచ్చింది. సెన్సెక్స్ ఉదయం 73,734.36 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 74,106.85) నష్టాల్లో ప్రారంభమైంది. ఇంట్రాడేలో 73,282.41 వద్ద కనిష్ఠాన్ని తాకింది. తర్వాత పుంజుకొని 509.73 పాయింట్ల లాభంతో 74,616.58 వద్ద ముగిసింది. నిఫ్టీ 155.40 పాయింట్ల లాభంతో 23,123.65 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 93గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, టీసీఎస్, ఇన్ఫోసిస్, భారతీ ఎయిర్‌టెల్, సన్‌ఫార్మా స్టాక్స్ లాభపపడ్డాయి. ఇండిగో, అదానీ పోర్ట్స్, మహీంద్రా అండ్ మహీంద్రా, టైటాన్, ట్రెంట్ స్టాక్స్ నష్టాలు చవిచూశాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 110 డాలర్ల వద్ద ట్రేడవుతుండగా.. బంగారం ఔన్సు 4663 డాలర్ల వద్ద కొనసాగుతోంది. ఆసియా మార్కెట్లలో దక్షిణ కొరియా కోస్పీ, జపాన్ నిక్కీ, షాంఘై ఎస్ఎస్ఈ కాంపోజిట్ రాణించాయి. యూరోపియన్ మార్కెట్‌లు కూడా లాభాల్లో ప్రారంభమయ్యాయి.

# కొవిడ్ తరహా ప్యాకేజీ.. వారికి 2.5 లక్షల కోట్లతో క్రెడిట్ గ్యారెంటీ స్కీమ్



పశ్చిమాసియా యుద్ధం కారణంగా ప్రభావితమైన రంగాలను ఆదుకునేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధమవుతోంది. వ్యాపారాలను, ముఖ్యంగా ఎంఎస్ఎంఈలను ఆదుకునేందుకు రూ.2.5 లక్షల కోట్లతో క్రెడిట్ గ్యారెంటీ స్కీమ్‌ను సిద్ధం చేస్తున్నట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. ఈ స్కీమ్ కింద బ్యాంకులు ఇచ్చే రుణాలకు ప్రభుత్వం హామీగా ఉంటుంది. ఒకవేళ వ్యాపారాలు నష్టపోయి అప్పు తీర్చలేని పరిస్థితి వస్తే.. ప్రభుత్వం 90 శాతం (గరిష్ఠంగా రూ.100 కోట్ల వరకు) గ్యారెంటీ ఇస్తుంది. ప్రభుత్వ అనుబంధ సంస్థ అయిన నేషనల్ క్రెడిట్ గ్యారెంటీ ట్రస్టీ కంపెనీ నుంచి ఈ గ్యారెంటీ లభిస్తుంది. ప్రభుత్వం రూ.17వేల నుంచి రూ.18 వేల కోట్లు మేర ఈ స్కీమ్ కింద వెచ్చించనుంది. కొవిడ్-19 సమయంలో వివిధ రంగాలను ఆదుకునేందుకు ప్రభుత్వం ఇదేరీతిన 2020లో ఓ ప్యాకేజీని ప్రకటించింది. ఆత్మనిర్భర్ భారత్ అభియాన్‌లో భాగంగా ఎంఎస్ఎంఈలు, ఇతర వ్యాపారులను ఆదుకునేందుకు ఎమర్జెన్సీ క్రెడిట్ లైన్ గ్యారెంటీ స్కీమ్ ను తీసుకొచ్చింది. దీనికింద అన్నిరంగాలకు 100 శాతం గ్యారెంటీతో రుణాలు అందించింది. ఈ పథకం కింద బ్యాంకులు లేదా ఆర్థికసంస్థలు ఇచ్చే రుణాలకు ప్రభుత్వం గ్యారెంటీ ఇస్తుంది. అప్పు తీసుకున్నవారు తిరిగి చెల్లించలేకపోతే, ప్రభుత్వం ఆ బాధ్యతను తీసుకుంటుంది. పూచీకత్తు లేకుండా తక్కువ వడ్డీకే రుణాలు అందించింది. దేశ ఆర్థికవ్యవస్థపై యుద్ధ ప్రభావం పడకుండా ప్రభుత్వం ఇప్పటికే పలు చర్యలు తీసుకుంది. పెరిగిన చమురు ధరల ప్రభావం వినియోగదారుల మీద భారం పడకుండా పెట్రోల్, డీజిల్‌పై రూ.10 మేర ఎక్సైజ్ సుంకాన్ని తగ్గించింది. డీజిల్‌పై లీటరుకు రూ.21.50, ఏవియేషన్ టర్బైన్ ఫ్యూయల్‌పై లీటరుకు రూ.29.50 చొప్పున ఎగుమతి సుంకం విధించింది. కీలక పెట్రో కెమికల్ ఉత్పత్తులకు దిగుమతి సుంకాన్ని మినహాయించింది. తాజాగా యుద్ధ ప్రభావిత రంగాలకు మద్దతు ఇచ్చేందుకు త్వరలో ఈ పథకాన్ని అధికారికంగా ప్రకటించనుంది. యుద్ధ ప్రభావిత రంగాలను ఆదుకుంటామని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ కూడా ప్రకటించారు.

# విమాన ప్రయాణికులకు ఎయిరిండియా షాక్.. సర్‌ఛార్జీ పెంపు




టాటా గ్రూప్‌నకు చెందిన ప్రముఖ విమానయాన సంస్థ ఎయిరిండియా గ్రూప్ విమాన ప్రయాణికులకు షాకిచ్చింది. దేశీయ, అంతర్జాతీయ విమాన ప్రయాణ టికెట్లపై ప్రస్తుతం వసూలుచేస్తున్న ఫ్యూయల్ సర్‌ఛార్జీని పెంచేసింది. దేశీయ మార్గాల్లో విమాన టికెట్లపై కనిష్ఠంగా రూ.299 నుంచి రూ.899 చొప్పున వసూలుచేయనుంది. అంతర్జాతీయ విమాన సర్వీసులకు 24 డాలర్ల నుంచి 280 డాలర్లకు వరకు వసూలుచేయనున్నట్లు ప్రకటించింది. కొత్త ఛార్జీలు డొమెస్టిక్ ప్రయాణికులకు ఏప్రిల్ 8 నుంచి అంతర్జాతీయ ప్రయాణికులకు 10 నుంచి వసూలుచేస్తామని తెలిపింది. పశ్చిమాసియా యుద్ధం నేపథ్యంలో విమాన ఇంధన (ఏటీఎఫ్) ధరను చమురు మార్కెటింగ్ సంస్థలు ఏప్రిల్ 1న సవరించాయి. అంతర్జాతీయంగా ముడిచమురు ధర బాగా పెరిగినా విమానయాన సంస్థలపై కేవలం 25% (లీటరుకు రూ.15) భారాన్ని మాత్రమే మోపుతున్నట్లు పెట్రోలియం మంత్రిత్వశాఖ తెలిపింది. పన్నులతో కలిపి చూస్తే ఏటీఎఫ్ ధర పెంపు 8.5 శాతంగా ఉంటుందని తెలిపింది. ఈ నేపథ్యంలో ఏటీఎఫ్ ధరలు పెరిగిన మరుసటిరోజే ఇండిగో ఫ్యూయల్ ఛార్జీలను సవరించగా.. ఎయిరిండియా తాజాగా నిర్ణయం తీసుకుంది. ఎయిరిండియాతో పాటు, ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ విమాన ప్రయాణాల పైనా ఈ భారం పడనుంది.

పెంపు ఇలా..

దేశీయ విమాన సర్వీసులకు ప్రయాణించే దూరాన్ని బట్టి ఫ్యూయల్ సర్‌ఛార్జి వర్తిస్తుంది. 0-500 కిలోమీటర్లకు రూ.299; 501-1000 కిలోమీటర్ల వరకు రూ.399; 1001-1500 కిలోమీటర్ల వరకు రూ.549; 1501-2000 కిలోమీటర్ల వరకు రూ.749; 2వేల కిలోమీటర్ల పైబడి ప్రయాణ టికెట్లపై రూ.899 చొప్పున ఫ్యూయల్ సర్‌ఛార్జీ వసూలు చేయనున్నారు. అంతర్జాతీయ ప్రయాణికులకు కనిష్ఠంగా 24 డాలర్లు వసూలు చేయనున్నారు. పశ్చిమాసియాకు 50 డాలర్లు, ఆగ్నేయాసియా 100; సింగపూర్ 60, ఆఫ్రికా 130, యూకేకు 205, ఉత్తర అమెరికా, ఆస్ట్రేలియా వంటి దేశాలకు 280 డాలర్లు చొప్పున ఈ ఫ్యూయల్ సర్‌ఛార్జిని వసూలు చేయనున్నట్లు ఎయిరిండియా గ్రూప్ పేర్కొంది.

# రూ.40 వేలు పెరిగిన 390 డ్యూక్ ధర!



భారతదేశంలో దిగ్గజ కంపెనీలు తమ వాహనాల ధరలను పెంచుతున్న తరుణంలో.. కేటీఎమ్ ఇండియా కూడా తన 390 డ్యూక్ ధరను రూ. 40,000 పెంచింది. దీంతో ఈ మోటార్‌సైకిల్ ధర రూ. 3.39 లక్షలకు (ఎక్స్-షోరూమ్) చేరింది. 2025 సెప్టెంబర్ చివరిలో.. అమల్లోకి వచ్చిన జీఎస్టీ 2.0 కింద ప్రవేశపెట్టిన సవరించిన జీఎస్టీ విధానం నేపథ్యంలో ఈ పెరుగుదల జరిగింది. కొత్త పన్ను విధానం ప్రకారం.. 350 సీసీ కంటే ఎక్కువ ఇంజిన్ సామర్థ్యం ఉన్న మోటార్‌సైకిళ్లపై ఇప్పుడు 40 శాతం జీఎస్టీ విధిస్తారు. కాబట్టి ఇప్పుడు కంపెనీ బైక్ ధరను పెంచింది. ప్రకటన వెల్లడించిన సమయంలో.. భారతదేశంలో బజాజ్ ఆటో ఆధ్వర్యంలో పనిచేస్తున్న కేటీఎం ఇండియా, ట్రయంఫ్ మోటార్‌సైకిల్స్ రెండూ.. తమ తమ 390 మరియు 400ఎ మోడళ్ల ధరలు యథాతథంగా ఉంటాయని, అదనపు ఖర్చులను కంపెనీయే భరిస్తుందని పేర్కొన్నాయి.

# చేతక్ స్క్రీన్ అవార్డ్స్ 2026


## 14 విజయాలతో ధురందర్ ఆధిపత్యం; ఉత్తమ చిత్రంగా హోమ్బౌండ్

## ఉత్తమ నటుడి పురస్కారాలు యామీ గౌతమ్, రణవీర్ సింగ్లు గెలుచుకున్నారు



**విశాఖపట్నం, ఏప్రిల్ 07 (నేటి మనదేశమ్) :** సినిమా అవార్డులపై ప్రజలకు మరోసారి ప్రేమను పంచుతూ, చేతక్ స్క్రీన్ అవార్డ్స్ 2026, హిందీ సినిమా మరియు ఓటీటీని నిర్వచించే ప్రతి అంశాన్ని, దాని ప్రధాన లక్షణమైన విశ్వస నీయతను ఏమాత్రం కోల్పోకుండా, అత్యంత వైభవంగా వేడుక జరుపుకుంది. ఏప్రిల్ 5, ఆదివారం నాడు ముంబైలో తారల సమక్షంలో జరిగిన ఒక కార్యక్రమంలో, 2025 సంవత్సరాన్ని మనందరికీ మరింత ప్రత్యేకంగా మార్చిన అత్యుత్తమ ప్రతిభావంతులను చేతక్ స్క్రీన్ అవార్డులతో సత్కరించారు. ఈ అవార్డులను కఠినమైన, పారదర్శకమైన ప్రక్రియ ద్వారా ఖరారు చేశారు. ఇటీవలి కాలంలో బాలీవుడ్కు అతిపెద్ద వేదికగా నిలిచిన ఈ వేడుకలో, దర్శకుడు నీరజ్ ఘైవాన్ రూపొందించిన 'హోమ్బౌండ్' ఉత్తమ చిత్రంగా నిలిచింది. మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్ మరియు వ్యాపారవేత్త నీతా అంబానీ చిత్ర బృందానికి ట్రోఫీని అందజేశారు. ఈలోగా, దర్శకుడు ఆదిత్య ధర్ యొక్క 'ధురంధర్' ఈ వేడుకలో ప్రధాన చిత్రంగా నిలిచి, మొత్తం 14 అవార్డులను కైవసం చేసుకుంది. బాలీవుడ్ ఐకాన్ ధర్మేంద్రకు జీవిత సాఫల్య పురస్కారం (లైఫ్టైమ్ అచీవ్మెంట్ అవార్డు) ప్రదానం చేశారు. ఆదిత్య ధర్ ఉత్తమ దర్శకుడిగా చేతక్ స్క్రీన్ అవార్డును గెలుచుకోగా, 'హక్' చిత్రంలో తన నటనకు గాను యామీ గౌతమ్ ఉత్తమ నటిగా ఎంపికయ్యారు, మరియు 'ధురంధర్' చిత్రానికి గాను రణవీర్ సింగ్ ఉత్తమ నటుడిగా ట్రోఫీని అందుకున్నారు. ఒక ముఖ్యమైన మరియు సమయోచితమైన చర్యగా, చేతక్ స్క్రీన్ అవార్డ్స్ 2026, ఓటీటీ రంగంలోని సినీ ప్రతిభను గుర్తించడానికి ఐదు కొత్త విభాగాలను ప్రవేశపెట్టింది. 'మిసెస్' చిత్రంలో తన నటనకు గాను సాన్యా మల్హోత్రా ఉత్తమ నటి (ఓటీటీ చిత్రం) అవార్డును గెలుచుకోగా, చేతక్ స్క్రీన్ అవార్డులలో కరణ్ తేజ్పాల్ దర్శకత్వం వహించిన 'స్టోలెన్' చిత్రం ప్రధాన విజేతగా నిలిచింది. ఈ చిత్రం ఉత్తమ ఓటీటీ చిత్రం, ఉత్తమ దర్శకుడు (ఓటీటీ చిత్రం) (కరణ్ తేజ్పాల్), ఉత్తమ నటుడు (పురుషుడు) (ఓటీటీ చిత్రం) (అభిషేక్ బానర్జీ), మరియు ఉత్తమ స్క్రిప్ట్ (ఓటీటీ చిత్రం) (కరణ్ తేజ్పాల్, గౌరవ్ ధింగ్రా, మరియు స్వప్నిల్ సల్కర్) వంటి అవార్డులను గెలుచుకుంది. బాలీవుడ్ స్టార్ ఆలియా భట్ వ్యాఖ్యాతగా వేదికపైకి రాగా, ఆమెతో పాటు నటులు-హాస్యనటులు సునీల్ గ్రోవర్, జాకిర్ ఖాన్ మరియు 'ది ఇండియన్ ఎక్స్ప్రెస్' హిందీ ఎడిటర్ సౌరభ్ ద్వివేది కూడా పాల్గొన్నారు. ఈ అట్టహాసమైన వేడుక అత్యంత వైభవంగా జరిగింది. అయితే అదే సమయంలో, చేతక్ స్క్రీన్ అవార్డులు కేవలం ఆడంబరానికి మాత్రమే పరిమితం కాలేదు. 'ఇన్ మెమోరియం' విభాగంలో, 2025లో కన్నుమూసిన భారతీయ చిత్ర పరిశ్రమ దిగ్గజాలను గౌరవించారు. ఆ దిగ్గజాల చిత్రాలు ఒక్కొక్కటిగా పెద్ద తెరపై కనిపిస్తుండగా, హాజరైన వారందరూ లేచి నిలబడి, దివంగతులకు నివాళులర్పించారు. ఆ తర్వాత, బాబీ డియోల్ తన దివంగత తండ్రి ధర్మేంద్ర తరపున జీవిత సాఫల్య పురస్కారాన్ని స్వీకరించారు. ఈ పురస్కారాన్ని ప్రముఖ స్క్రీన్ రైటర్-గేయ రచయిత జావేద్ అక్తర్, సీనియర్ చిత్రనిర్మాత రమేష్ సిప్పీ, మరియు మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్ ప్రదానం చేశారు. సభను ఉద్దేశించి ప్రసంగిస్తున్నప్పుడు బాబీ గొంతు పూడుకుపోయి, "మీ అందరి కళ్లలో మా నాన్నగారి ప్రేమ కనిపిస్తోంది. మా నాన్నగారు తన పని ద్వారా, అలాగే ఆయనకు కొత్త హాబీగా మారిన ఇన్స్టాగ్రామ్ రీల్స్ ద్వారా కూడా అందరి హృదయాలను స్పృశించారు" అని అన్నారు. ధర్మేంద్ర ఎల్లప్పుడూ సంతోషాన్ని, కృతజ్ఞతను పంచాలని నమ్మేవారని పేర్కొంటూ, బాబీ ఇలా అన్నారు, "ప్రజలు సంతోషంగా ఉండాలని ఆయన ఎల్లప్పుడూ కోరుకునేవారు మరియు దేవుడు మనందరికీ జీవితంలో ఎంతో ఇచ్చాడని నమ్మేవారు. మనందరిలో ఒక ప్రత్యేకమైన ప్రతిభ దాగి ఉందని, దానిని మనం నమ్మితే ఏదైనా సాధించగలమని ఆయన చెప్పేవారు."

# ద ఇండియన్ మహిళా ఫౌండేషన్ సేవలు అభినందనీయం : ఏసిపి అంబేద్కర్





**విశాఖపట్నం, నేటి మనదేశమ్ ప్రతినిధి, ఏప్రిల్ 07 :** సర్వేజనా సుఖినోభవంతు నినాదంతో ద ఇండియన్ మహిళా ఫౌండేషన్ సేవలు అభినందనీయమని ఏసిపి అంబేద్కర్ కొనియాడారు. సర్వేజనా సుఖినోభవంతు కార్యక్రమంలో భాగంగా ఏసిపి అంబేద్కర్ ను ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు జీవీఎల్ పద్మ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జీవీఎల్ పద్మ మాట్లాడుతూ మహిళల అభ్యున్నతి కోసం పిల్లలు ఆస్తులకే వారసులు కాకూడదు, వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులకు బాసట కావాలనేదే తమ కార్యక్రమ లక్ష్యంగా చెప్పారు. సమాజంలో వృద్ధాశ్రమాలు పెరిగిపోవడానికి గల కారణాలను, వివరించి ప్రధానమైన మూలాలపై చర్య తీసుకోవాలని కోరారు. పిల్లలు అనేవారు ఆస్తులుకే వారసులు కాకూడదని, వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులను సంరక్షించే బాధ్యతాయుత నడవడిక ఏర్పడే విధంగా నేటి యువతకు అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. ఏసిపి అంబేద్కర్ మాట్లాడుతూ మహిళల ప్రగతికి నగరంలో ఉన్న అన్ని స్వచ్ఛంద సేవకులు ఒక సమూహంగా ఏర్పడి ఐక్యతతో ఉన్నత సేవలు అందించాలన్నారు. కష్టాలలో కూడా మహిళ తన ఆత్మస్థైర్యాన్ని పునికి పుచ్చుకోవాలని సమస్యలున్నప్పుడల్లా చావే పరిష్కారం కాకూడదని అన్నారు. మహిళల్లో మనోధైర్యాన్ని నింపే, మార్గదర్శకాలు ఈ స్వచ్ఛంద సంస్థలు కావాలని ఆయన ఆకాంక్షించారు. ఒకరితో కానిది సమిష్టి కృషితో సమూహంగా ఏర్పడితే తప్పకుండా ఉన్నత విలువలతో కూడిన సమాజాన్ని నిర్మించగలమని ఆయన పేర్కొన్నారు. ఏసిపి ని కలిసిన వారిలో ఫౌండేషన్ సభ్యులు ఎన్ ఏ కుమార్, కే. కుమారి, రమ్య, సీత ఉన్నారు.

# ఒక దేశం యొక్క నిజమైన బలం దాని ప్రజల ఆరోగ్య శ్రేయస్సుపై ఆధారపడి ఉంటుంది

**– డా. ప్రతాప్ సి.రెడ్డి, వ్యవస్థాపక చైర్మన్, అపోలో హాస్పిటల్స్**



**విశాఖపట్నం, ఏప్రిల్ 07 (నేటి మనదేశమ్)** :అపోలో హాస్పిటల్స్ హెల్త్ ఆఫ్ ది నేషన్ 2026 (HoN 2026) నివేదిక యొక్క ఆరవ ఎడిషన్ ప్రకారం, భారతదేశంలో అత్యంత సాధారణ ఆరోగ్య ప్రమాదాలు ముందుగా వస్తున్నాయి. శ్రామిక జనాభాలో దాదాపు సగం మందికి ప్రీడయాబెటిస్ లేదా డయాబెటిస్ ఉంది, 10 మందిలో 8 మంది అధిక బరువుతో ఉన్నారు. విటమిన్ ఙ మరియు దీ12 లోపం అధిక స్థాయిలో ఉండడంతోపాటు తగ్గిపోతున్న ఫిట్నెస్ అంతరాలు ఆరోగ్య ప్రమాదాల స్థాయిని నొక్కిచెప్తున్నాయి. అపోలో హాస్పిటల్స్, విశాఖపట్నం COO Dr. కృష్ణప్రసాద్ వివరముల ప్రకారం వైజాగ్ పరిసర ప్రాంతాలలో చేసిన హెల్త్ చెక్స్ లో రమారమి ప్రతి 100 మందిలో 27 మంది మధుమేహంతో బాధపడుతున్నారు అని, ప్రతి 100 మందిలో 18 మంది గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్నారు అని, ప్రతి 100 మందిలో 26 మంది రక్త హీనతతో బాధపడుతున్నారు అని, ప్రతి 100 మందిలో 80 మంది స్థూలకాయంతో బాధపడుతున్నారు అని గుర్తించామనిఅన్నారు.

ఈ దేశవ్యాప్త రిపోర్ట్ రిలీజ్ సందర్భంగా డా. ప్రతాప్ సి. రెడ్డి, వ్యవస్థాపక చైర్మన్, అపోలో హాస్పిటల్స్ వారు మాట్లాడుతూ: ఒక దేశం యొక్క నిజమైన బలం దాని ప్రజల ఆరోగ్య శ్రేయస్సుపై ఆధారపడి ఉంటుంది. చాలాకాలంగా, ఆరోగ్య పరీక్షలు కేవలం రొటీన్ రక్త పరీక్షలు మరియు వైటల్స్గా పరిగణించబడ్డాయి --- ఈరోజు, మేము ఒక ముఖ్యమైన మార్పుకు సంకేతమిస్తున్నాము. నిజమైన ఆరోగ్యం వ్యక్తిగతంగా, చురుకుగా మరియు అత్యంత నిర్దిష్టంగా ఉంటుంది. ఏ రెండు జీవితాలూ ఒకేలా ఉండవు కాబట్టి, నివారణ విధానం కూడా వ్యక్తుల మాదిరిగా వ్యక్తిగతంగా ఉండాలి. మేము గట్ మైక్రోబయోమ్ ఆరోగ్యం నుండి అధునాతన దీర్ఘకాలిక ప్రమాద నమూనాల వరకు విజ్ఞాన హద్దులను విస్తరిస్తున్నాము --- ఎందుకంటే సమగ్ర ఆరోగ్య తనిఖీ అనేది స్వయం-సంరక్షణ యొక్క అత్యుత్తమ చర్య.

డా. ప్రీతా రెడ్డి, ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్పర్సన్, అపోలో హాస్పిటల్స్వారు మాట్లాడుతూ: ప్రతి మహిళ యొక్క శ్రేయస్సు కుటుంబాలను, సమాజాలను మరియు ఆర్థిక వ్యవస్థను బలపరిచే ఒక శక్తి. మహిళల ఆరోగ్య అంతరాన్ని తగ్గించడం వల్ల 2040 నాటికి ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు సంవత్సరానికి ౡ1 ట్రిలియన్ వరకు అదనంగా జోడించవచ్చని అంచనాలు చెబుతున్నాయి. మేము మహిళల ఆరోగ్యాన్ని జాతీయ ప్రాధాన్యత మరియు భాగస్వామ్య బాధ్యతగా పరిగణిస్తాము. స్వయం సంరక్షణ ఒక అధికారం మాత్రమే కాదు; అది ఒక శక్తి. డా. సంగీతా రెడ్డి, జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్, అపోలో హాస్పిటల్స్ వారు మాట్లాడుతూ, ఆరోగ్యకరమైన దీర్ఘాయువు అనేది అవకాశం కాదు, అది ప్రారంభ, నిరంతర చర్య. సరైన ఆరోగ్య తనిఖీ, సరైన సమయంలో, గుండె జబ్బు మరియు క్యాన్సర్లను స్టేజ్ 1లో గుర్తించగలదు --- అవి అత్యంత చికిత్స చేయగలవు. భారతదేశం లక్షణ-ఆధారంగా ఉండటాన్ని భరించలేదు; మనం ఆరోగ్యాన్ని ఎలా సంప్రదించాలో అంచనా, నిరంతర మరియు లోతుగా వ్యక్తిగతంగా మారాలి.

**హెల్త్ ఆఫ్ ది నేషన్ గురించి**


ఈ నివేదిక ప్రకారం ఆరోగ్య సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించడానికి మరియు వ్యాధి నివారణను మెరుగుపరచడానికి, రోగ నిర్ధారణ ఖచ్చితత్వాన్ని పెంచే సామర్థ్యం ఉన్న పరిష్కారాలను గుర్తించడమే లక్ష్యమనీ తెలిపింది. హెల్త్ ఆఫ్ ది నేషన్ ద్వారా పంచుకున్న చాలా డేటా అపోలో హాస్పిటల్స్ యొక్క డీ-ఐడెంటిఫైడ్ హాస్పిటల్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్లు మరియు జువీ=, అపోలో గ్రూప్లో భాగంగా ఇతర అధ్యయనాలు, అలాగే బహిరంగంగా అందుబాటులో ఉన్న సమాచారంపై ఆధారపడి ఉంది.

**అపోలో హాస్పిటల్స్ గురించి**

డా. ప్రతాప్ రెడ్డి 1983లో చెన్నైలో మొదటి ఆసుపత్రిని తెరిచినప్పుడు అపోలో ఆరోగ్య సంరక్షణను విప్లవాత్మకంగా మార్చింది. నేడు, అపోలో 76 ఆసుపత్రులలో 10,400కు పైగా పడకలు, 7,113ం ఫార్మసీలు, 308 క్లినిక్లు, 2,457 డయాగ్నొస్టిక్ కేంద్రాలు మరియు 800ం టెలిమెడిసిన్ కేంద్రాలతో ప్రపంచంలోనే అతిపెద్ద సమీకృత ఆరోగ్య సంరక్షణ వేదిక. ఇది 3,00,000కు పైగా ఆంజియోప్లాస్టీలు మరియు 2,00,000 సర్జరీలు నిర్వహించిన ప్రపంచంలోని అగ్రగామి కార్డియాక్ కేంద్రాలలో ఒకటి. అపోలో యొక్క 1,20,000 కుటుంబ సభ్యులు అసాధారణ సంరక్షణ అందించడానికి అంకితమయ్యారు.

# వైద్య సహాయ నిమిత్తం ఏ పేద కుటుంబం అధైర్య పడవద్దు అండగా ఉంటాను-ఎమ్మెల్యే కూన రవికుమార్

- నిస్సహాయ స్థితిలో ఉన్న కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ కొండంత భరోసా -ఎమ్మెల్యే కూన రవికుమార్
- పలు పేద కుటుంబాలకు ఇంటి వద్దకు వెళ్లి జవీ=ఖీ చెక్కులు అందించిన పొందూరు మాజీ ఎంపీపీ కూన ప్రమీల



**శ్రీకాకుళం, ఏప్రిల్ 07 (నేటి మనదేశమ్)** :అమదాలవలస నియోజకవర్గశీలో బూర్జ సరుబుజ్జిలి ఆమదాలవలస మండలాలకు సంబంధించిన గ్రామాలులో ఈ మధ్య కాలంలో అనారోగ్యంతో బాధపడుతున్న పలు కుటుంబాలకు వైద్య ఖర్చులు నిమిత్తం చికిత్స నిమిత్తం ఆర్థిక సహాయంగా వారి కుటుంబాలకి ముఖ్యమంత్రి సహాయ నిధి (జవీ=ఖీ) నుండి వచ్చిన చెక్కులను పంపిణీ చేయడం జరిగింది. ఈ చెక్కులను ఆమదాలవలస గౌరవ శాసనసభ్యులు మరియు రాష్ట్ర పియుసి చైర్మన్ శ్రీ కూన రవికుమార్ గారి సతీమణి పొందూరు మండల మాజీ ఎంపీపీ శ్రీమతి కూన ప్రమీలా మేడం గారు స్వయంగా లబ్ధిదారులు కుటుంబాల ఇంటి వద్దకు వెళ్లి వారిని పరామర్శించి వారి ఆరోగ్య పరిస్థితులను తెలుసుకొని లబ్ధిదారులకి చెక్కులు ఇవ్వడం జరిగినది.

**లబ్ధిదారుల వివరాలు**

1. పొట్నూరు శ్రీనివాసరావు-- 114000 మెట్టెక్కివలస 2.గొర్ల మహేశ్వరరావు--117000 దన్నానపేట3. రెడ్డి అప్పల నరసమ్మ--67000 చిన్న జొన్నవలస 4. పొట్నూరు శివ సాయి-- 60000 కలివరం 5. కూటికుప్పల మౌనిక-- 300000 బప్పడం 6. సైలాడ మణికంఠ-- 63000 అన్నం పేట 7. కొన్ని ఎర్రయ్య-- 100000 సింధు వాడఈ కార్యక్రమంలో లబ్ధిదారులు ముఖ్యమంత్రి కి మరియు ఎమ్మెల్యే కూన రవికుమార్ గారికి ధన్యవాదాలు తెలిపారు. అర్హులైన ప్రతీ కుటుంబానికి వైద్య ఖర్చుల నిమిత్తం ఆర్థిక సాయం అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తున్నదని సీఎం చంద్రబాబు నాయుడు కష్టాల్లో ఉన్న ప్రతి కుటుంబానికి పెద్ద కొడుకు వలే ఆదుకుంటున్నారని కూన ప్రమీలా తెలిపారు.

ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, కూటమి ముఖ్య నాయకులు,పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# వరల్డ్ హెల్త్ డే సందర్భంగా ఒమేగా హాస్పిటల్స్ లో క్యాన్సర్ స్క్రీనింగ్ ప్యాకేజీలు




**విశాఖపట్నం, నేటి మనదేశమ్ ప్రతినిధి, ఏప్రిల్ 07 :** వరల్డ్ హెల్త్ డే సందర్భంగా ఎన్ఎబీహెచ్ గుర్తింపు పొందిన ఒమేగా హాస్పిటల్స్, విశాఖపట్నం ప్రజల్లో క్యాన్సర్ పై అవగాహన పెంపొందించడం కోసం, తొలిదశ లోనే క్యాన్సర్ ను గుర్తించేందుకు ప్రత్యేక

క్యాన్సర్ స్క్రీనింగ్ ప్యాకేజీలను ప్రారంభించినట్లు హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ బి. రవి శంకర్, హాస్పటల్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ శు భాకర్ రావు తెలిపారు.కార్యక్రమంలో భాగంగా పురుషులు, మహిళల కోసం విడివిడిగా క్యాన్సర్ స్క్రీనింగ్ ప్యాకేజీలను కేవలం రూ.999/-లకు అందుబాటులోకి తీసుకువచ్చినట్లు తెలియజేశారు.

ఈ సందర్భంగా హాస్పిటల్ ఎండి డాక్టర్ బి. రవి శంకర్ మాట్లాడుతూ క్యాన్సర్ ను ప్రారంభ దశలో గుర్తించినట్లయితే రోగికి కావలసిన చికిత్సను సమర్ధవంతంగా అధిగమించి, వారి జీవన విధానాన్ని తిరిగి యదాస్తితిలోకి తీసుకురావడం చాలా సులభం అవుతుందన్నారు. అంతే కాకుండా క్యాన్సర్ను ప్రారంభ దశలోనే గుర్తించడం ద్వారా అనేకరకాల క్యాన్సర్ లను పూర్తిగా నయం చేసుకోనే అవకాశం వుందన్నారు. అటువంటి అధునాతన సౌకర్యాలు, చికిత్స విధానాలు ఒమేగా హాస్పిటల్ లో అందుబాటులో వున్నాయని తెలిపారు. అనంతరం చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ శుభాకర్ రావు మాట్లాడుతూ చాలా తక్కువ వ్యయంతో అంటే దాదాపు రూ.7000 విలువ గల పరీక్షలను కేవలం రూ.999 లకే అందిస్తున్న ఈ చెక్అప్ అవకాశాన్నివిశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలకు చెందిన ప్రజలు వినియోగించు కోవాలని కోరారు.మహిళల ప్యాకేజీలో కంప్లీట్ బ్లడ్ కౌంట్, సి బి సి క్రియేటినిన్, లివర్ ఫంక్షన్ టెస్ట్, రాండమ్ గ్లూకోజ్, వయస్సును బట్టి డిజిటల్ మమోగ్రఫీ లేదా అల్ట్రాసౌండ్ స్కాన్, పాప్ స్మియర్తో పాటు డాక్టర్, డైటీషియన్ కన్సల్టేషన్లు అందిస్తారని చెప్పారు.

పురుషుల ప్యాకేజీలో కంప్లీట్ బ్లడ్ కౌంట్, సి బి సి, యూరిన్ పరీక్ష, చెస్ట్ ఎక్స్ రే, అబ్డొమెన్ అల్ట్రాసౌండ్, పి ఎస్ ఏ పరీక్ష, రీనల్ ఫంక్షన్ టెస్ట్, ఫాస్టింగ్ బ్లడ్ షుగర్ తో పాటు డాక్టర్, డైటీషియన్ కన్సల్టేషన్లు ఉన్నాయని తెలిపారు.ఈ ప్రత్యేక ఆఫర్ ఏప్రిల్ 30వ తేదీ వరకు మాత్రమే అందుబాటులో ఉంటుందని, ప్రజలు ఈ అవకాశాన్ని వినియో గించుకుని తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని కోరారు.

# ఓ ఎస్ జి ఫౌండేషన్ చలివేంద్రం -1500 మందికి మజ్జిగ పంపిణీ



**భీమునిపట్నం ఏప్రిల్ 07 నేటి మన దేశమ్ :** రోజు రోజుకు తీవ్రరూపం దాల్చుతున్న వేళ, ప్రయాణికులు, కార్మికులు, గ్రామ స్తుల దాహార్తిని తీర్చేందుకు ఓ ఎస్ జి ఫౌండేషన్ ఆధ్వర్యంలో పెద్దిపాలెం గ్రామ రహదారిపై ఏర్పాటు చేసిన చలివేంద్రం విశేష స్పందన లభించింది. భీమిలి నియలభించింది ఆనందపురం మండలం పెద్దిపాలెం గ్రామం రోడ్డుపై ఉన్న ఓ ఎస్ జి ఆర్య డిజిటల్ స్టూడియో సమీపంలో ఈ సేవా కార్యక్రమాన్ని సంస్థ వ్యవస్థాపకుడు శివ దళాయి ప్రారంభించారు. ఎండ తీవ్రత దృష్ట్యా వడదెబ్బలు తగలకుండా ప్రజలకు ఉపశమనం కలిగించే ఉద్దేశంతో ఈ చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు.కార్యక్రమం మొదటి రోజే సుమారు 1500 మందికి పైగా ప్రయాణికులు, గ్రామస్థులు, కార్మికులకు చల్లని మజ్జిగ పంపిణీ చేశారు ఈ కార్యక్రమాన్ని సంస్థ సభ్యుడు సుబ్బు జన్మదినం పురస్కరించుకొని ప్రారంభించడం మాకు ఎంతో ఆనందంగా ఉందని శివ దళాయి పేర్కొన్నారు. సేవా కార్యక్రమాన్ని ఒక ప్రత్యేక దినాన ప్రారంభించడం ద్వారా సమాజానికి ఉపయోగపడే మంచి సందేశం వెళ్లాలని తమ ఉద్దేశమని చెప్పారు. ఇదే ఉత్సాహంతో రానున్న కొన్ని ముఖ్యమైన రోజులలో మజ్జిగ పంపిణీ కొనసాగిస్తూ, మిగిలిన రోజుల్లో ప్రతిరోజూ ప్రయాణికుల దాహార్తిని తీర్చేలా చల్లని తాగునీటి సదుపాయాన్ని నిరంతరం అందుబాటులో ఉంచుతామని వెల్లడించారు.

# వ్యర్థాల పునర్వినియోగానికి సహకరిద్దాం

## – జీవీఎంసీ అదనపు కమిషనర్ పి.నల్లనయ్య




**విశాఖపట్నం ఏప్రిల్ 07 (నేటి మనదేశమ్) :** నగరంలో నిత్యం ఉత్పత్తి అయ్యే వ్యర్ధాలను పునర్వినియోగ ప్రక్రియను అలవర్చుకొని నగరాన్ని మరింత పరిశుభ్రంగా తీర్చిదిద్దేందుకు నగర ప్రజలు సహకరించాలని జీవీఎంసీ అదనపు కమిషనర్ పి. నల్లనయ్య పేర్కొన్నారు. మంగళవారం ఆయన వేస్ట్ టు వండర్ కార్యక్రమంలో భాగంగా పెందుర్తి జోన్ 89వ వార్డులోని యల్లపువానిపాలెం లోని ఆదర్శ గ్రామంలో కృష్ణయ్య గృహంలో మిద్దె తోటల పెంపకం, ప్లాస్టిక్ పునర్వినియోగ ప్రక్రియ మొదలైన పర్యావరణహిత ఆవరణాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా జీవీఎంసీ అదనపు కమిషనర్ మాట్లాడుతూ వ్యర్థాల పునర్వినియోగ ప్రక్రియ ద్వారా పర్యావరణహితంగా వినూత్నమైన వస్తువులను తయారు చేయవచ్చునని, వ్యర్థాల పునర్వినియోగించడం ద్వారా ఆర్థిక లాభం పొందవచ్చునని, తద్వారా నగర పరిశుభ్రత, పర్యావరణానికి నగర ప్రజలు సహకరించాలని తెలిపారు. యల్లపువానిపాలెం లో గల కృష్ణయ్య అనే నివాసితులు తమ గృహంలో వ్యర్థాల పునర్వినియోగం చేయు విధానాన్ని పరిశీలించి ఆయనను అభినందించారు. సేంద్రియ ఎరువు ఇంట్లోనే తయారు చేసి గార్డెన్ మొక్కలకు ఎరువుగా విని





యోగించడం, ప్లాస్టిక్ వ్యర్థాలను పునర్వినియోగించడం వంటి వాటిని పరిశీలించారు. ఖాళీ సీసాలతో ప్లాంట్ పాట్స్ లేదా డ్రిప్ ఇర్రిగేషన్ గా తీర్చిదిద్దడంతోపాటు బాటిల్స్ లో ప్లాస్టిక్ వ్యర్థాలతో గట్టిగా నింపడం ద్వారా ఏకో బ్రిక్ తయారు చేశారని తెలిపారు. ఇటువంటి పర్యావరణ హితమైన కార్యక్రమాలు ప్రతి ఒక్కరూ చేపట్టడం ద్వారా నగర పర్యావరణాన్ని కాపాడగలుగుతామని, పచ్చదనాన్ని పెంపొందించుకోగలమని తెలిపారు. నగర పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇచ్చి స్వచ్ఛ సర్వేక్షన్లో మెరుగైన ర్యాంకు సాధనకు ప్రజలందరూ సహకరించాలని అదనపు కమిషనర్ కోరారు. ఈ కార్యక్రమంలో సహాయ వైద్యాధికారి జె .కృష్ణంరాజు శానిటరీ ఇన్స్పెక్టర్లు, వార్డ్ శానిటేషన్ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

# గీతం "పరిణామ"లో వెల్లిపిరిసిన యువత కళాత్మక నైపుణ్యం



**సాగర నగర్, ఏప్రిల్ 07 (నేటి మనదేశమ్) :**ప్రస్తుత తరం యువత నిరంతరం మొబైల్ స్క్రీన్‌లకు, సోషల్ మీడియా రీల్స్‌కే పరిమితమవుతున్నారనే అభిప్రాయం ఉన్న ఈ రోజుల్లో క్లాసికల్ ఆర్ట్స్ (శాస్త్రీయ కళల) పట్ల తమకున్న మక్కువను గీతం విద్యార్థులు చాటిచెప్పారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలోని హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ కు అనుబంధంగా గల ఫైన్ ఆండ్ పెర్‌ఫార్మింగ్ ఆర్ట్స్ విభాగం మంగళవారం తేది: 07-03-2026న నిర్వహించిన "పరిణామ" వేడుకతో క్యాంపస్ అంతా సృజనాత్మకతతో కళకళలాడింది. ఈ కార్యక్రమం డిజిటల్ ప్రపంచం నుండి లలిత కళల ప్రపంచానికి ఒక అద్భుతమైన ప్రయాణంలా సాగింది. టీనేజ్ దాటిన యువ హృదయాలు సాంప్రదాయ కళారూపాల్లో తమకున్న ప్రావీణ్యాన్ని ప్రదర్శించాయి. చిత్రకళా ప్రదర్శనతో పాటు సాంస్కృతిక నృత్యాలు, శాస్త్రీయ సంగీతం మరియు మృదంగ లయ విన్యాసంతో అలరించారు. విద్యార్థులు తమ అంతర్గత ఆలోచనలను కాన్వాస్ పై రంగులతో అద్భుతంగా చిత్రించి, ఆత్మప్రకటనకు కళ ఒక శక్తివంతమైన మాధ్యమమని నిరూపించారు. అలాగే శాస్త్రీయ సంగీత ప్రదర్శనలతోప్రేక్షకులు మంత్రముగ్ధులను చేశారు. సాంప్రదాయ దుస్తులు ధరించి లయబద్ధమైన అడుగులతో నృత్య కళాకారులు చేసిన ప్రదర్శన అందరినీ అలరించింది. గీతం విశ్వవిద్యాలయం అమలు చేస్తున్న నూతన విద్యా విధానం (ఎన్ఇపి) ఈ వేడుకలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. గీతంలో సైన్స్.మేనేజ్‌మెంట్, ఇంజనీరింగ్ చదివే విద్యార్థులు కేవలం తరగతి గదులకు, ల్యాబ్‌లకు పరిమితం కాకుండా తమకు నచ్చిన సంగీతం, నృత్యం లేదా పెయింటింగ్‌ను "మైనర్" సబ్జెక్టుగా ఎంచుకునే వెసులుబాటు ఉంది. ఇది విద్యార్థుల ఆలోచనా దృక్పథాన్ని మరింత విస్తృతం చేస్తోంది. మంగళవారం జరిగిన పరిణామ సాంస్కృతిక వేడుకలలో ఇది ప్రతిబింబించింది. కార్యక్రమాలకు హాజరైన గీతం ప్రోవైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వై.గౌతమరావు, గీతం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డి.గుణశేఖరన్‌లు తమ ప్రసంగాలలో యువతకు సరైన మార్గం చూపిస్తే వారు అద్భుతాలు సృష్టించగలరనడానికి ఈ కార్యక్రమమే నిదర్శనమని కొనియాడారు.

లలిత కళల్లో నిమగ్నం అవ్వడం ద్వారా విద్యార్థులు మొబైల్ వ్యసనానికి దూరంగా ఉంటూ జీవితాన్ని సంపూర్ణ దృక్పథంతో అర్థం చేసుకుంటున్నారు అని పేర్కొన్నారు. విద్యాపరమైన క్రమశిక్షణకు కళాత్మక అభిరుచికి మధ్య ఉండాల్సిన అందమైన సమతుల్యతను ఈ వేడుక చాటి చెప్పిందన్నారు. కార్యక్రమానికి సంధానకర్తగా డాక్టర్ ఎ.మాల్యాద వ్యవహరించారు. సరైన వేదికను కల్పిస్తే ఈ మొబైల్ జనరేషన్ భారతదేశపు గొప్ప సాంస్కృతిక వారసత్వాన్ని కాపాడటమే కాకుండా దానిని ముందుకు తీసుకెళ్లగలరని డాక్టర్ మాల్యాద ఈ సందర్భంగా తెలిపారు.

# జాబ్ సీకర్స్ నుంచి జాబ్ క్రియేటర్స్ వైపు విద్యార్థులు - ఈ.ఎం.డి.పి కార్యక్రమం



**విశాఖపట్నం, ఏప్రిల్ 07 (నేటి మనదేశమ్) :** విశాఖపట్నం జిల్లా, ZPHS తోటగరువులో ఈరోజు ఆంధ్రప్రదేశ్ స్కూల్ ఎడ్యుకేషన్ శాఖ, ఎస్‌సీఈఆర్టీ మరియు ఉద్యమ్ లెర్నింగ్ ఫౌండేషన్ వారి సంయుక్త ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఎంట్రీప్రన్యూరియల్ మైండ్సెట్ డెవలప్మెంట్ కార్యక్రమం లో భాగంగా జిల్లా విద్యాశాఖ అధికారి అనుమతితో జిల్లా స్థాయి ప్రోజెక్ట్ ఎక్స్పో విజయవంతంగా నిర్వహించబడింది. ఈ ఎక్స్‌పోలో రాష్ట్ర స్థాయి నుంచి ఎంపికైన 10 ప్రాజెక్టులు జిల్లా స్థాయిలో ప్రదర్శించబడ్డాయి. విద్యార్థులు తమ సృజనాత్మక ఆలోచనలను ఆధారంగా చేసుకుని భవిష్యత్ వ్యాపార వేత్తలుగా ఎదగాలనే లక్ష్యంతో ప్రొడక్ట్–బేస్డ్ ప్రాజెక్టులను రూపొందించి ప్రదర్శిం చారు. ఉద్యోగాల కోసం మాత్రమే కాకుండా, ఉద్యోగాలను సృష్టించే దిశగా ముందుకు సాగాలని విద్యార్థులు తమ నమూనా ప్రాజెక్టుల ద్వారా స్పష్టమైన సందేశాన్ని అందించారు. జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం జెడ్.పి.హెచ్.ఎస్ అగనంపూడి, ద్వితీయ స్థానం జెడ్.పి.హెచ్.ఎస్ వెల్లంకి ప్రాజెక్టులు సాధించాయి. ఈ కార్యక్రమం 9వ తరగతి విద్యార్థులకు ప్రతి శని వారం పాఠశాలలో ఒక పీరియడ్ ద్వారా సెషన్‌ల రూపంలో ఉపాధ్యాయులు బోధిస్తున్నారు. విద్యార్థులు తమ జీవితంలో ఎదురయ్యే సమస్యలను గుర్తించి, వాటికి సృజనాత్మక పరిష్కా రాలను అందించే విధంగా ఈ కార్యక్రమం రూపు దిద్దుకుంది. ప్రస్తుతం ఎక్కువ మంది విద్యార్థులు ఉద్యోగాల కోసం మాత్రమే చదువుతున్న నేపథ్యంలో, దేశానికి అవసరమైన జాబ్ క్రియేటర్స్ ను తయారు చేయడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశంగా నిర్వాహకులు తెలిపారు.

# జీవీఎంసీ క్రికెట్ జట్టు 8 వికెట్ల తేడాతో ఘనవిజయం

## – జీవీఎంసీ అదనపు కమిషనర్ పి.నల్లనయ్య



**విశాఖపట్నం ఏప్రిల్ 07 (నేటి మనదేశమ్) :** మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ క్రికెట్ జట్టు ఏపీఈపీడీసీఎల్ జట్టుపై ఎనిమిది వికెట్ల తేడాతో ఘన విజయం సాధించిందని జీవీఎంసీ అదనపు కమిషనర్ పి. నల్లనయ్య పేర్కొన్నారు. మంగళవారం త్రీష్ణ మైదానంలో జీవీఎంసీ, ఏపీఈపీడీసీఎల్ జట్ల మధ్య వీడిసిఏ ఇన్స్టిట్యూషన్ మ్యాచ్ నిర్వహించడం జరిగిందని ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. జీవీఎంసీ, ఏపీఈపీడీసీఎల్ జట్ల మధ్య జరిగిన క్రికెట్ పోటీలలో జీవీఎంసీ జట్టు 8 వికెట్లు తేడాతో ఘన విజయం సాధించిందని, మొదటగా బ్యాటింగ్ చేసిన ఏపీఈపీడీసీఎల్ జట్టు 17.4 ఓవర్లలో 81 పరుగులు చేసి ఆల్ అవుట్ అయిందని, తదుపరి జీవీఎంసీ జట్టు 9.5 ఓవర్లలో 2 వికెట్లు నష్టపోయి 83 పరుగులతో విజయం సాధించిం దన్నారు. జీవీఎంసీ తరపున సునంద 29, శ్రీను 25 పరుగులు సాధిం చారని, రాజు 3 వికెట్లు, సుబ్రహ్మణ్యం 2 వికెట్లు, చక్రపాణి 2 వికెట్లు సాధించి జీవీఎంసీ జట్టు విజయంలో కీలకపాత్ర పోషించారని తెలిపారు. ఈ సందర్భంగా విజయం సాధించిన

జీవీఎంసీ క్రికెట్ జట్టు ను జీవీఎంసీ అదనపు కమిషనర్ తో పాటు ఇంచార్జి స్పోర్ట్స్ డైరెక్టర్ ఈ ఎ రాజు, టీమ్. మేనేజర్ సన్నీ అభినందించారు.

# జీవీఎంసీలో "నమస్తే స్కీమ్" ను ప్రారంభించిన అదనపు కమిషనర్ పి.నల్లనయ్య







**విశాఖపట్నం ఏప్రిల్ 07 (నేటి మనదేశమ్) :** కేంద్ర ప్రభుత్వం మార్గదర్శకాల మేరకు జీవీఎంసీ పరిధిలో పనిచేస్తున్న సెప్టిక్ ట్యాంక్, యు జి డి కార్మికుల ఆరోగ్య, భీమా తో పాటు ఇతర మౌలిక, సంక్షేమ సదుపాయాలు పరిరక్షణకు శ్రీకారం చుట్టడం జరిగిందని జీవీఎంసీ అదనపు కమిషనర్ పి. నల్లనయ్య పేర్కొన్నారు. మంగళవారం ఆయన జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని సమావేశం లో కేంద్ర ప్రభుత్వం మార్గదర్శకాల మేరకు జీవీఎంసీ గుర్తించిన నవజీవన ఆర్గనైజేషన్ ఏజెన్సీ ద్వారా నమస్తే స్కీమును జీవీఎంసీ ప్రధాన వైద్యాధికారి డాక్టర్ ఈ ఎన్ వి నరేష్ కుమార్ తో కలిసి లాంచనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా జీవీఎంసీ అదనపు కమిషనర్ మాట్లాడుతూ నమస్తే స్కీమ్ మొదటి దశలో జీవీఎంసీ పరిధిలో సెప్టిక్ ట్యాంకు, యు జి డి లో పనిచేసే వారి కొరకు కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నమస్తే స్కీమును లాంచనంగా ఇప్పటికే ప్రారం భించడం జరిగిందని, రెండవ దశలో పిఎఫ్, ఈఎస్ఐ లేని కార్మికు లను గుర్తించి, వారిని ఈ పథకం లోనికి తీసుకు రావడం ద్వారా ఎంతో ఉప యోగ పడుతుందని తెలిపారు. జీవీఎంసీ గుర్తించిన నవజీవన ఆర్గనైజేషన్ ఏజెన్సీ జీవీఎంసీ పరిధిలోని ప్రతి వార్డులలో ఉన్న సెప్టిక్ ట్యాంక్, యు జి డి లో పనిచేస్తున్న కార్మికులే కాకుండా ప్రైవేటుగా పనిచేస్తున్న యుజిడి, సెప్టిక్ ట్యాంక్ కార్మికులను , రాగ్ పిక్కర్స్ గుర్తించి వారి ఆధార్ కార్డు, బ్యాంక్ అకౌంట్ ద్వారా స్కీములో వారిని చేర్చుకోవడంతోపాటు వారికి అవసరమయ్యే ఆరోగ్య, ప్రధాని బీమా యోజన, పిపి కిట్లు, సబ్సిడీపై లోన్లు ఏర్పాటు మొదలైనవి నవజీవన ఆర్గనైజేషన్ ఏజెన్సీ సభ్యులు చేపడతారని అదనపు కమిషనర్ తెలిపారు.

అనంతరం అందరితో కలిసి 'నమస్తే "స్కీమ్ సంబంధించిన పోస్టర్ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నవజీవన ఆర్గనైజేషన్ ఏజెన్సీ ప్రతినిధులు, సభ్యులు, పలువురు కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# జీవీఎంసీ బాల్యం కేంద్రాలు నిర్వహణ ఆదర్శనీయం

## – విశాఖ పార్లమెంటు సభ్యులు ఎం.శ్రీ భరత్



**విశాఖపట్నం ఏప్రిల్ 07 (నేటి మనదేశమ్) :** బాల్యం విద్యార్థులలో క్రమశిక్షణ మంచి నడవడిక సమర్థవంతంగా అందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని విశాఖపట్నం పార్లమెంటు సభ్యులు ఎం.శ్రీ భరత్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన జీవీఎంసీ నార్త్ జోన్ , అక్కయ్యపాలెం, ఎన్ జి జి ఓ కాలనీ లోని జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలలో నిర్వహిస్తున్న బాల్యం విద్యా కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించి నిర్వహణను అభినందించారు. ఈ సందర్భంగా పార్లమెంటు సభ్యులు బాల్యం విద్యా కేంద్రాలలోని విద్యార్థులతో ముచ్చటిస్తూ, పూర్వ ప్రాథమిక విద్యకు సంబంధించిన పలు ప్రశ్నలను అడిగి వారి ప్రతిభను పరిశీలించారు. జీవీఎంసీ బాల్యం విద్యా కేంద్రాల నిర్వహణ ఆదర్శనీయంగా, స్ఫూర్తిదాయకంగా ఉన్నాయని అభినందించారు. బాల్యం కేంద్రాలలో పూర్వ ప్రాథమిక విద్యను సమర్థవంతంగా అందించేందుకు "బాల్యం పూర్వ ప్రాథమిక విద్యా విజ్ఞాన ప్రబోధిని" పుస్తకం ను తిలకించి చిన్నారులకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం బాల్యం చిన్నారుల కొరకు అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తుందని తెలిపారు. అలాగే బాల్యం విద్యార్థులు క్రమశిక్షణ బాగుందని వారికి అందించే పోషకాహారం వివరాలు తెలుసుకొని బాల్యం చిన్నారులకు అవసరమయ్యే అన్ని సదుపాయాలు అందించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇస్తూ ఆనందంతో తన అభిప్రాయాన్ని వ్రాత పూర్వకంగా సూచనల పుస్తకంలో వ్రాసి సంతకం చేశారు. ఈ కార్యక్రమంలో ఎం ఈ ఓ, పాఠశాల హెడ్మాస్టర్, బాల్యం టీచర్లు పలువురు తెలుగుదేశం పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



Edited, Printed, Published and owned by K.S. Ranga Sayi and published from 8-272/9/2, VUDA Colony, Gopalapatnam, Visakhapatnam - 530027 (A.P.) Printed at SKYLINE PRESS, D.N`•.8-272/9/2, VUDA Colony, Gopalapatnam, Visakhapatnam - 530027. (A.P) Ph: 0891-2531616, Email: netimanadesamvizag16@gmail.com